RNI NO:TELTEL/2017/74161

www.janavijayam.com

జన విజయం
JANA VIJAYAM

మీరు జర్నలిస్టుగా పని చేస్తారా?

రెండు తెలుగు రాష్ట్రాల నుండి జనవిజయం వారపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్, నియోజకవర్గం ఇన్‌చార్జ్, మండల రిపోర్టర్‌లు కావలెను.

సంఘటనను వార్తగా మలచే తెలుగు భాషా ప్రావీణ్యం ఉంటే చాలు.

18సం. పైన వయసు కలిగియుండి జర్నలిజం పట్ల ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

మీ వివరాలను పంపించాల్సిన చిరునామా:

వాట్సాప్ నెంబర్ : 9866925937

మెయిల్ ఐ.డి : janavijayam@gmail.com

ఖమ్మం | సంపుటి : 9 | సంచిక : 31 | 3-9 మే, 2026 | ఎడిటర్ : పల్లా కొండల రావు | పేజీలు : 4 | వెల : రూ. 15.00

KHAMMAM | Volume : 9 | Issue : 31 | 3-9 May, 2026 | Editor : Palla Kondala Rao | Pages : 4 | Price : Rs.15.00

ప్రభుత్వం కంటే ప్రైవేటు పాఠశాలలు గొప్పవా?

ఒక్కో విద్యార్థికి రూ.లక్ష వరకు ఖర్చు: సీఎం రేవంత్

హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు స్కూళ్లు ఎందుకు గొప్ప అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సర్కార్ బడిలో ఒక్కో విద్యార్థికి రూ. లక్ష వరకు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు స్కూళ్లో మాత్రం రూ. 25 వేలే ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 50వేలకు పైగా నియామకాలు చేపట్టాం. ఉద్యోగ నియామకాలకు సంబంధించి కోర్టుల్లో ఉన్న చిక్కుముళ్లు విప్పుతూ సమస్యలు పరిష్కరించాం. గతంలో సంతలో సరకులా ప్రశ్నపత్రాలు అమ్మారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉందని పెద్దలు చెప్పారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 25 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. 11వేల ప్రైవేటు పాఠశాలల్లో 36.7లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం కంటే ప్రైవేటు పాఠశాలలు గొప్పవా? ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు రూ.25వేల వరకు ఖర్చవుతుంటే, ప్రభుత్వ బడుల్లో రూ. లక్ష వరకు ఖర్చవుతోంది. విద్యార్థుల భవిష్యత్తును విద్యాశాఖ తీర్చిదిద్దాలి. గతంలో విద్యాశాఖ నిర్లక్ష్యానికి గురైంది. విద్యాశాఖను ప్రక్షాళన చేసి ప్రభుత్వం అండగా ఉంది. విద్యకు ప్రాధాన్యం ఇచ్చి విద్యాశాఖకు రూ.21,650 కోట్లు కేటాయించాం అని సీఎం వివరించారు.

అప్పుడు సైబరాబాద్.. ఇప్పుడు గూగుల్ రాకతో విశాఖ

విశాఖపట్టణం: ప్రపంచమంతా గూగుల్‌లో సెర్చ్ చేస్తుంటే.. గూగుల్ మాత్రం ఏపీని ఎంచుకుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ చరిత్రలో కొత్త టెక్ శకానికి శ్రీకారం చుట్టిన రోజు ఇది. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో టెక్నాలజీ రంగంలో ఏపీ తలెత్తుకుని నిలుస్తుందన్నారు.. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఇదేనని.. దేశానికి ఏఐ డేటా గేట్ వేగా ఏపీ నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో భారత చరిత్రలో 2026 ఏప్రిల్ 28వ తేదీ శాశ్వతంగా నిలిచిపోతుంది. విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ, ఈ ప్రాజెక్టు కేవలం విశాఖకే కాకుండా మొత్తం రాష్ట్రానికే ఒక గేమ్ ఛేంజర్ అని పేర్కొన్నారు. 1997లో తాను హైటెక్ సిటీని ప్రారంభించి సైబరాబాద్ నగరాన్ని నిర్మించానని, ఇప్పుడు గూగుల్ రాకతో ఏపీ టెక్నాలజీ ప్రపంచంలో సగర్వంగా తలెత్తుకుని నిలబడుతుందని ధీమా వ్యక్తం చేశారు. సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్, ఇప్పుడు భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మారబోతోందని, ఒక గిగావాట్ సామర్థ్యంతో పనిచేసే ఈ డేటా సెంటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ డేటా గేట్‌వేగా నిలుస్తుందని స్పష్టం చేశారు.ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు వెనుక మంత్రి నారా లోకేష్ కృషిని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా కొనియాడారు. లోకేష్ అమెరికాలోని గూగుల్ క్యాంపస్‌కు వెళ్లి వారిని ఏపీకి ఆహ్వానించారని, ఏ పని అప్పగించినా పట్టుదలతో పూర్తి చేస్తారని ప్రశంసించారు. అదానీ, ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ సంస్థలతో కలిసి గూగుల్ ఇక్కడ పెట్టుబడులు పెట్టడం శుభపరిణామమని, ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. 2028 సెప్టెంబర్ నాటికి ఈ డేటా సెంటర్ పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అవసరమైతే రెండు, మూడు నెలలు ముందుగానే పూర్తి చేసేందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కేవలం ఎంఓయూలకే పరిమితం కాకుండా, పనుల ప్రారంభంలోనూ ఏపీ ముందుంటుందని నిరూపించామన్నారు.రాష్ట్ర మౌలిక సదు-పాయాల అభివృద్ధిపై కూడా చంద్రబాబు పలు కీలక ప్రకటనలు చేశారు. జూలై నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేస్తామన్నారు. కేంద్ర మంత్రులతో చర్చించిన మేరకు రాబోయే ఏడెనిమిదేళ్లలో అమరావతి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలను కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు వస్తాయని, అలాగే జూన్ 1న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభమవుతుందని తెలిపారు. మిగిలిన నగరాలతో పోలిస్తే ఏపీలో వ్యాపార నిర్వహణ ఖర్చు చాలా తక్కువగా ఉంటుందని, పెట్టుబడిదారులు ఏపీని తమ గమ్యస్థానంగా మార్చుకోవాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

ఉత్తరాంధ్ర దశ మార్చిన గూగుల్.. దేశంలోనే ఏపీ నెంబర్ వన్

విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిపై కీలక ప్రకటనలు చేశారు. జూన్ 1వ తేదీ నుంచి సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌కు అధికారిక నోటిఫికేషన్ ఇస్తున్నందుకు కేంద్ర రైల్వే మంత్రికి ధన్యవాదాలు తెలిపిన ఆయన, ఈస్ట్ వెస్ట్ కారిడార్ అనుసంధానంతో ఈ ప్రాంతం లాజిస్టిక్స్ హబ్‌గా మారుతుందని పేర్కొన్నారు. దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే రావడం విశేషమని, కేవలం ఒప్పందాలకే కాకుండా ప్రాజెక్టుల గ్రౌండింగ్‌లోనూ ఏపీ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని సీఎం స్పష్టం చేశారు.

మరో రంగారెడ్డి జిల్లాగా అనకాపల్లి జిల్లా..

ఉత్తరాంధ్ర భవిష్యత్తుపై ధీమా వ్యక్తం చేస్తూ, గతంలో వలసలకు నిలయమైన ఈ ప్రాంతం ఇకపై ఉద్యోగాలకు చిరునామాగా మారుతుందని, 'ట్యాలెంట్ మైగ్రేషన్'కు కాలం చెల్లిందని చంద్రబాబు అన్నారు. జూలైలో ప్రధాని మోదీ చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించబోతున్నామని, 2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఒప్పందాలు, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ విస్తరణతో అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా అభివృద్ధికి కేంద్రబిందువు అవుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీ టార్గెట్ తెలంగాణ – భారీ సభకు కమలం కసరత్తు

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ సానుకూల ఫలితాలను ఆశిస్తోంది. ఈ ఫలితాలు వెలువడిన వారం రోజుల్లోనే ప్రధాని నరేంద్ర మోదీని రంగంలోకి దించి, తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు సృష్టించాలని అధిష్ఠానం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ పర్యటనలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు జనాగ్రహ సభను కూడా ఖరారు చేసింది. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న ప్రజల అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని పార్టీ భావిస్తోంది.ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ ఫలితాలపై బీజేపీ భారీ ఆశలు పెట్టుకుంది. ఒకవేళ బెంగాల్ గడ్డపై కాషాయ జెండా ఎగిరితే, ఆ ఉత్సాహం తెలంగాణ బీజేపీ నేతల్లో రెట్టింపు కానుంది. బెంగాల్ విజయం ఇక్కడి కేడర్‌లో కొత్త రక్తం నింపుతుందని, ఆ ఊపుతోనే మిషన్ తెలంగాణ ను వేగవంతం చేయవచ్చని అమిత్ షా వంటి అగ్రనేతలు భావిస్తున్నారు. బెంగాల్ వంటి బలమైన ప్రాంతీయ శక్తి ఉన్న రాష్ట్రంలోనే గెలవగలిగితే, తెలంగాణలో కేసీఆర్ మార్కు రాజకీయాలను ఎదుర్కోవడం కష్టం కాదనే సంకేతాలను మోదీ సభ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు.ప్రధాని మోదీ నిర్వహించబోయే జనాగ్రహ సభ కేవలం ఒక సాధారణ బహిరంగ సభ మాత్రమే కాదు. కాంగ్రెస్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభం, బీఆర్ఎస్‌లో వినిపిస్తున్న అసమ్మతి స్వరాలను తమ వైపు తిప్పుకోవడానికి ఇదొక వేదిక కానుంది. తెలంగాణలో బీఆర్ఎస్‌కు అసలైన ప్రత్యామ్నాయం బీజేపీనే అనే బలమైన ముద్రను వేయడానికి మోదీ ఈ వేదికపై నుంచి కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది. ఈ సభ ద్వారా అటు అధికార పక్షాన్ని, ఇటు కాంగ్రెస్‌ను ఏకకాలంలో ఇరకాటంలోకి నెట్టాలన్నది కాషాయ వ్యూహం. తెలంగాణ బీజేపీ నేతలు సైతం ఈ పర్యటనపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే మోదీ రాకతో రాష్ట్రవ్యాప్తంగా భారీ చేరికలకు ప్లాన్ చేస్తున్నారు. ఇతర పార్టీల్లోని అసంతృప్త నేతలకు బీజేపీలో చేరడానికి మోదీ సభ ఒక ముహూర్తం గా మారుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బెంగాల్ ఫలితాలు అనుకూలంగా వస్తే, తెలంగాణలో బీజేపీ నేతల దూకుడుకు అడ్డుకట్ట వేయడం ఎవరికీ సాధ్యం కాదన్న భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. బీజేపీ తన రెండో గేరును మార్చి వేగంగా ముందుకు దూసుకెళ్లడానికి సిద్ధమైంది. ఐదు రాష్ట్రాల ఫలితాలు ఇచ్చే బూస్ట్‌తో మోదీ జనాగ్రహం ద్వారా తెలంగాణలో రాజకీయ సమీకరణాలను మార్చేయాలని చూస్తోంది. ఈ పర్యటన తర్వాత రాష్ట్ర రాజకీయాలు కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్లుగా మారుతాయా లేదా అన్నది మే మొదటి వారంలో తేలనుంది.

టికెట్ లేదని 20,000 లంచం డిమాండ్

చెప్పుతో కొట్టిన ప్రయాణికులు, కండక్టర్

మహబూబ్ నగర్ : ఇటీవల ఇందిరమ్మ ఇంటి మంజూరు కోసం ఓ మహిళను అధికారి లంచం అడిగితే ఆమె ఎలా బుద్ధి చెప్పిందో తెలుగు రాష్ట్రాలు మొత్తం చూశాయి. లంచం డబ్బులు తీసుకెళ్లి అందరూ చూస్తుండగా నువ్వు అడిగిన డబ్బులు తెచ్చాను తీసుకో అంటూ వెంటపడి మరీ అతడికి బుద్ధొచ్చేలా చేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. తాజాగా ఆర్టీసీ బస్సులో లంచం అడిగిన ఘటన తెలంగాణలో సంచలనంగా మారింది. లంచం అడిగిన టికెట్ ఇన్‌స్పెక్టర్ ను కండక్టర్, ప్రయాణికులు చెప్పుతో కొట్టారు. హైదరాబాద్ నుండి నారాయణ్‌ఖేడ్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును తనిఖీ చేసేందుకు తెలంగాణలోని రాయికోడ్ వద్ద టికెట్ స్క్వాడ్ అధికారులు నిలిపివేశారు. ఆ బస్సులో ప్రయాణికుల రద్దీ చాలా ఎక్కువగా ఉంది. చెకింగ్ సమయంలో ఒక ప్రయాణికుడు టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నట్లు టికెట్ ఇన్‌స్పెక్టర్లు గుర్తించారు. అయితే, నిబంధనల ప్రకారం అతనికి విధించాల్సింది రూ. 500. కాగా, జరిమానా విధించకపోగా.. కేసు నమోదు చేయకుండా ఉండేందుకు టికెట్ ఇన్‌స్పెక్టర్ ఆ ప్యాసింజర్, కండక్టర్‌ను ఏకంగా రూ. 20,000 లంచం డిమాండ్ చేశాడు. టికెట్ ఇన్‌స్పెక్టర్ చేసిన ఈ డిమాండ్‌తో కండక్టర్, ప్రయాణికుడితో పాటు బస్సులోని ప్రయాణికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. సహనం కోల్పోయిన వారు ఆ ఆర్టీసీ టికెట్ ఇన్‌స్పెక్టర్‌ను చెప్పులతో కొట్టారు. ఈ క్రమంలో బస్సు కండక్టర్ కూడా ప్రయాణికులతో కలిసి మరిన్ని చెప్పు దెబ్బలు కొట్టి బుద్ధి చెప్పాడని తెలుస్తోంది. సాధారణంగా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల సిబ్బందిపై పనిభారం ఎక్కువగా ఉంటుందని తెలిసిందే. అలాంటి పరిస్థితుల్లో రద్దీ కారణంగానే టికెట్ ఇవ్వడం కండక్టర్‌కు సాధ్యపడలేదని తెలుస్తోంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఒక వ్యక్తిని ఇలా గుంపుగా కొట్టడాన్ని చట్టప్రకారం సమర్థించలేకపోయినా, సామాన్య ప్రజల ఆగ్రహాన్ని మాత్రం నూటికి నూరు శాతం అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే నిత్యం కష్టపడి పనిచేసేవారు ఎవరైనా లంచం అడిగితే మండిపడుతున్నారు. వారికి బుద్ధి చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఏటీఎం ల దగ్గర మోసం చేసే నిందితుడు అరెస్టు

హైదరాబాద్: హైదరాబాద్లో ఏటీఎం వద్ద డబ్బులు మోసం చేసే అంతర్రాష్ట్ర నేరస్థుడు అరెస్ట్ అయ్యాడు. ఖైరతాబాద్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఏటీఎం లకు వచ్చే అమాయకులను టార్గెట్ చేసిన నిందితుడు, డబ్బు డిపాజిట్ చేస్తానని నమ్మబలికి మోసం చేస్తాడు. నకిలీ నెఫ్ట్ ట్రాన్సాక్షన్ మెసేజ్లు చూపించి నగదు దోపిడి చేస్తాడు. బాధితులను నమ్మించి నగదు తీసుకుని పరార్ అవుతాడు. మొత్తం రూ.2.40 లక్షలు బ్యాంక్ ఖాతాలో ఫ్రీజ్ చేసారు పోలీసులు. నిందితుడి దగ్గర రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సుల్తాన్ బజార్లో మహిళ నుంచి రూ.1 లక్ష మోసం, ఏటీఎం లో డిపాజిట్ చేయలేకపోయిన మహిళను మోసం చేసాడు. నా ఖాతాలో ట్రాన్స్ఫర్ చేస్తాను అంటూ నమ్మించి మోసం చేసాడు. గతంలో కూడా నిందితుడుపై అనేక కేసులు నమోదయ్యాయి. 2018 నుంచి 2025 వరకు 73 కేసులు వున్నాయి. సిసిటివి ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి పట్టుకున్నారని ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి విలేఖరిహత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

తుగ్గలి:చిత్తూరు జిల్లాలోని వీ.కోట ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డి ను హత్య చేసిన దుండగులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఏపీయూడబ్ల్యూజే తుగ్గలి మండల గౌరవ అధ్యక్షులు మురళీమోహన్ రెడ్డి,అధ్యక్షులు విజయ్,కమిటీ సభ్యులు బుధవారం రోజున తుగ్గలి తహసిల్దార్ కు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి విలేకరి కొంతమంది దుండగులు అతి దారుణంగా హత్య చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని, హత్యకు పాల్పడిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని వారు తెలియజేశారు. అదేవిధంగా ఇలాంటి దాడులను అరికట్టడానికి జర్నలిస్టుల సంక్షేమం కొరకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని వారు తెలియజేశారు. అలాగే హత్యకు గురైన జగన్మోహన్ రెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు.

తెలంగాణ సెంటిమెంట్‌పై పోరు

కవిత ఓటు.. ఎవరికి చేటు..

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగిన ఆవిర్భావ సభలో ఆమె పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించి, రానున్న రాజకీయాల్లో తాను స్వతంత్ర శక్తిగా ఎదగనున్నట్లు సంకేతాలిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. ఈ క్రమంలో కవిత పెట్టిన పార్టీ ఎవరిని దెబ్బతీస్తుంది అన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతోంది.కవిత తన పార్టీకి 'టీఆర్ఎస్' అని పేరు పెట్టడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. ఒకప్పుడు కేసీఆర్ నేతృత్వంలోని ఉద్యమ పార్టీ 'టీఆర్ఎస్' (తెలంగాణ రాష్ట్ర సమితి) పేరును బీఆర్ఎస్‌గా మార్చుకున్న తర్వాత ఏర్పడిన సెంటిమెంట్ శూన్యాన్ని భర్తీ చేసేందుకు కవిత ఈ వ్యూహాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. 'బీఆర్ఎస్ తన ఆత్మను కోల్పోయింది' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు పాత తరం ఉద్యమకారులను ఆకట్టుకునే ప్రయత్నంలో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం బీఆర్ఎస్‌కు అతిపెద్ద ముప్పుగా మారనుందని, పార్టీ ఓటు బ్యాంకును, ముఖ్యంగా కేడర్‌ను కవిత వైపు మళ్లించే అవకాశం ఉందని స్పష్టమవుతోందికవిత తన తొలి ప్రసంగంలో కాంగ్రెస్, బీజేపీలను పక్కనబెట్టి, కేసీఆర్, కేటీఆర్ నాయకత్వాన్ని టార్గెట్ చేయడం గమనార్హం. 'కేసీఆర్ ఇప్పుడు మారు మనిషి అయ్యారు, గుంట నక్కల చేతిలో బందీ అయ్యారు' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు కుటుంబ కలహాల తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఆస్తుల పంపకాల విషయంలో తలెత్తిన విభేదాలే ఈ పార్టీ ఆవిర్భావానికి ప్రధాన కారణమని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలను, కేటీఆర్, హరీశ్‌రావుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించే శ్రేణులను తనవైపు తిప్పుకోవడమే కవిత ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.రాష్ట్రంలో తనదైన ముద్ర ఉన్న కవిత, క్షేత్రస్థాయిలో ప్రజలను ప్రభావితం చేయగల సామర్థ్యం కలిగి ఉన్నారు. కేసీఆర్ ఇటీవల మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ కార్డును తెరపైకి తెచ్చినప్పటికీ, కవిత అదే సెంటిమెంట్‌ను 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో వాడుకోవడం బీఆర్ఎస్‌కు పెద్ద ఇబ్బందిగా మారింది. ఒకప్పుడు షర్మిల రాజకీయ ప్రవేశం జరిగినప్పటికీ ఆమెకు లభించిన స్పందన కంటే, కవితకున్న సామాజిక గుర్తింపు మరియు తెలంగాణ ఉద్యమకారులతో ఉన్న అనుబంధం కారణంగా, బీఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆమె చీల్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కవిత ఎత్తుగడలు కేసీఆర్ కుటుంబంలోనే కాకుండా, పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.కేసీఆర్ ఇటీవల జీవన్‌రెడ్డి చేరిక సభలో తెలంగాణ సెంటిమెంటును రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. కొత్త ఎత్తులు పనిచేయకపోవడంతో పాత సెంటిమెంటును రగిలించే యత్నం చేశాడు. ఇప్పుడు కవిత కూడా తెలంగాణ సెంటిమెంటును పండిచంఆలనుకుంటుంది. దీంతో బీఆర్ఎస్‌కు ఇది ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. కవితకు తెలంగాణలో మంచి పట్టు ఉంది. ప్రజలను ప్రభావితం చేయగలదు. దీంతో కవిత పార్టీతో ముప్పు ఎదుర్కొనేది బీఆర్ఎస్ పార్టీనే అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అనుకున్నంతా ఈజీ కాదు...

ఒక రాజకీయ పార్టీని నడపాలంటే ఒకప్పుడు ఆర్థిక వనరులు అంతగా ఉండాల్సిన అవసరం ఉండదు కాదు. ఎందుకంటే కార్యకర్తలు పార్టీకి పని చేయడాన్ని ఒక గౌరవంగా భావించేవారు. రాజకీయ నాయకులు కూడా ఇప్పటి మాదిరిగా లేరు కాబట్టి.. అప్పుడు అంతగా ఖర్చు ఉండేది కాదు. పైగా దోచుకోవడం, దాచుకోవడం అనే సిద్ధాంతాన్ని నేతలు పాటించేవారు కాదు. దీనివల్ల రాజకీయాలు అంత ఖరీదుగా ఉండేవి కాదు.. మీడియా కూడా న్యూట్రల్ గా ఉండేది. అందువల్ల నాటి రోజుల్లో రాజకీయ పార్టీని నిర్వహించడానికి నేతలకు భారీగా డబ్బు అవసరం పడేది కాదు.ఇప్పటి రోజులు వేరు. ప్రతిదీ ఖరీదుగా మారిపోయింది. పార్టీ కార్యాలయాన్ని నిర్వహించాలి. జిల్లాలో కార్యాలయాలను నిర్వహించాలి. విలేకరుల సమావేశం పెడితే కవర్లు ఇవ్వాలి. సోషల్ మీడియాను రన్ చేయాలి. ప్రత్యర్థి పార్టీల నేతల మీద నిత్యం బురద చల్లుతూనే ఉండాలి. లీగల్ టీం బలోపేతంగా ఉండాలి. అన్నింటికీ మించి దండిగా సంపాదించుకోవాలి. తరాలు తిని కూర్చున్నా కూడా తగ్గని ఆస్తులను వెనకేసుకోవాలి. ఇదంతా జరగాలంటే దోపిడీ చేయాలి. దుర్మార్గాలకు పాల్పడాలి. అక్రమాలకు శ్రీకారం చుట్టాలి. అందువల్లే రాజకీయ నాయకులు అంటే ప్రజల్లో చులకన భావం.. మేధావుల్లో హేయమైన భావం.తెలంగాణ రాష్ట్రంలో మరో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు అయింది. ఈ పార్టీని ఏర్పాటు చేసింది తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత. తన పార్టీ పేరును ఆమె టిఆర్ఎస్ గా ప్రకటించారు. వాస్తవానికి ఒక మహిళ రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం మన దేశంలో కొత్తగాక పోయినప్పటికీ.. మఘలో పుట్టి పుబలో మునిగిపోయిన మాదిరిగా కాకుండా.. రాజకీయ పార్టీ సుదీర్ఘకాలం పనిచేయాలంటే కచ్చితంగా ఆర్థిక వనరులు ఉండాల్సిందే. కవిత పార్టీ ఏర్పాటు చేశారు కాబట్టి ఆమె దానిని కొనసాగించగలుగుతారా.. ఆమె దగ్గర ఉన్న ఆర్థిక స్థాయి ఎంత.. తెర వెనుక ఏవైనా భారీ అండదండలు ఉన్నాయా.. అనే ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా వ్యక్తం అవుతున్నాయి.రాజకీయ పార్టీని ఏర్పాటుచేసిన కవిత ఆర్థిక పరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే.. 2021లో ఎమ్మెల్సీ ఎలక్షన్ అఫిడవిట్ లో ఆమె తన పేరు మీద 39.79 కోట్ల ఆస్తులు ఉన్నాయని ప్రకటించారు. 21.62 కోట్ల అప్పులు ఉన్నాయని వెల్లడించారు. 1.9 కిలోల బంగారం, 11.2 కిలోల వెండి ఉన్నట్టు వెల్లడించారు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో 6.19 కోట్ల ఆస్తులు.. 2019 ఎన్నికల్లో 17.9 3 కోట్ల ఆస్తులు.. 2020లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 27.64 కోట్ల ఆస్తులు ఉన్నట్టు కవిత వెల్లడించారు. అయితే ఈ స్థాయి ఆస్తులతో రాజకీయ పార్టీని ఎలా నడుపుతారని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఆమె పార్టీలో ఆర్థికంగా బలంగా ఉన్న నాయకులు కనిపించడం లేదు. ఆమె చెప్పినట్టుగా గొప్ప గొప్ప నాయకులు పార్టీలో చేరలేదు. ఇప్పటికైతే పార్టీలో పెట్టుబడి పెట్టాల్సింది.. నిర్వహణ ఖర్చు చూసుకోవాల్సింది మొత్తం కవితనే. పైగా ఆర్థికంగా కవిత బలంగానే ఉన్నప్పటికీ.. అధికార పార్టీని.. ప్రతిపక్ష పార్టీని ఆమె ఏక కాలంలో విమర్శిస్తున్నారు. అలాంటప్పుడు ఆమెకు ఆర్థికంగా సహాయం చేయడానికి ఎవరు ముందుకు వస్తారు.. ఒకవేళ వచ్చినా ప్రభుత్వం ఒత్తిడికి వారు తట్టుకుంటారా.. ప్రతిపక్షం దూకుడు ముందు నిలబడతారా.. వీటిని సమర్థవంతంగా ఎదుర్కొంటేనే కవితకు, ఆమె రాజకీయ పార్టీకి మనగడం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు."పార్టీ ఆవిర్భావ సభను అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వంటకాలు మొత్తం కార్యకర్తలకు వడ్డించారు. కార్యకర్తలు కూడా భారీగానే వచ్చారు. జన సమీకరణ అనుకున్న దానికంటే ఎక్కువగానే చేశారు. పత్రికలలో భారీగా ప్రకటనలు ఇచ్చారు. ఇవన్నీ చూస్తుంటే కవిత అంత ఈజీగా లేరు. పైగా తను కేసీఆర్ కుమార్తె. అలాంటప్పుడు ఆమె తన పార్టీని గట్టిగానే నిర్వహిస్తారు. కెసిఆర్ కూడా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. చివరికి పార్టీని బలోపేతం చేసుకున్నారు. కవిత కూడా అలానే ఉంటుందేమో. ఎందుకంటే తను మాట్లాడుతున్న ప్రతి మాటలో కూడా స్పష్టత కనిపించింది. ధిక్కార స్వభావం వినిపించింది. అలాంటప్పుడు కవిత కచ్చితంగా పార్టీని బలోపేతం చేసుకుంటుందని నమ్మకం కనిపిస్తోందని" విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఆగస్టులోనే పరిషత్ ఎన్నికలు

హైదరాబాద్ : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని వేచి చూస్తున్న ఆశావహులకు మరో బిగ్ షాక్ తగిలేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆలస్యమైన ఈ ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. మరికొన్ని రోజుల పాటు ఈ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యేలా లేవు. జనగణన, ఉద్యోగుల బదిలీలతో పాలనపరమైన నిర్ణయాల నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించడం ఇప్పట్లో ఉండదని రాజకీయ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. దీంతో ప్రత్యేక అధికారులే పాలన సాగించనున్నారు.

తెలంగాణలో గత కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జులై నెల చివరి వరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ లేనట్లేనా అనే సందేహాలు కలుగుతున్నాయి. దీంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్న ఆశావహ అభ్యర్థులంతా మరికొంత కాలం వేచి చూడాల్సిన పరిస్థితి తప్పదనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రెండు నెలల పాటు జనగణన ప్రక్రియ నిర్వహించడంతోపాటు.. ఉద్యోగుల బదిలీలు కూడా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు తమ విధుల్లో బిజీగా ఉండనున్నారు. దీంతో ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని తెలుస్తోంది.ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పాలనాపరమైన ప్రక్రియలతోపాటు.. విద్యా సంవత్సరం మారనున్న నేపథ్యంలో జులై నెల చివరి వరకు స్థానిక ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని అర్థం అవుతోంది.

మే, జూన్ నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణలో జనగణన ప్రక్రియను చేపట్టనుండగా.. ఈ ప్రక్రియలోనే మొత్తం అధికార యంత్రాంగం నిమగ్నం కానుంది. మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు తెలంగాణలో ఇంటింటి సర్వే నిర్వహించనుండటంతో జనగణన విధుల్లోనే అధికారులందరూ ఉండనున్నారు.మ-రోవైపు.. ఇప్పటికే మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎత్తివేసింది. ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగుల బదిలీల ప్రక్రియ మొత్తం మే నెల అంతా కొనసాగనుంది. ఆ తర్వాత మళ్లీ జూన్ 1వ తేదీ నుంచి ఉద్యోగుల బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. అయితే ఆ లోపు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ అసాధ్యమని స్పష్టం అవుతోంది. అదే సమయంలో జూన్ నెలలో రాష్ట్రంలో స్కూళ్లు తిరిగి ప్రారంభం కానున్నాయి. అడ్మిషన్ల పెంపు, స్కూళ్లను మరింత బాగు చేయడం వంటి కార్యక్రమాలపై రాష్ట్ర విద్యా శాఖ ప్రత్యేక దృష్టి పెట్టనుంది.

హైదరాబాద్‌లో ఇలా చేస్తారా?

సైక్లింగ్ ట్రాక్‌పై ఏం జరుగుతుందో మహిళ వీడియో వైరల్

హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో అసభ్యకరంగా ప్రవర్తించే ఆకతాయిలు ఎక్కువైపోయారన్న విమర్శలు వస్తున్నాయి. తాజాగా ఓ యువతి సైక్లింగ్ ట్రాక్ పై రన్నింగ్ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి ఆమెను చూస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. దాంతో ఆమె...ఆ దృశ్యాలను రికార్డు చేసి.. భద్రతా పరమైన సందేహాలను లేవనెత్తారు. దాంతో ఆ వీడియో వైరల్ గా మారింది. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని నానక్‌రామ్‌గూడ సైక్లింగ్ ట్రాక్‌పై జరిగిన ఈ అసభ్యకర ఘటన నగరవాసులను ఉలిక్కిపడేలా చేసింది. ఉదయం ఆరు గంటలకు జాగింగ్‌కు వెళ్లిన ఒక యువతికి ఎదురైన చేదు అనుభవం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉదయం 6:15 గంటల సమయంలో తాను రన్నింగ్ చేస్తున్నప్పుడు ఒక వ్యక్తి అసభ్యకర చేష్టలకు పాల్పడటం చూసి సదరు యువతి దిగ్భ్రాంతికి గురైంది. ఆ దృశ్యాలను తన ఫోన్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో షేర్ చేసింది. తాను రన్నింగ్ దుస్తుల్లో ఉన్నానని ఇందులో తప్పేముందని ప్రశ్నించింది. కేవలం భద్రత కోసమే సూర్యుడు వచ్చిన తర్వాత రన్నింగ్‌కు వస్తున్నా.. అయినా ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరం అని వాపోయింది. ఆఖరికి ఆటోలో వెళ్తున్నప్పుడు కూడా ప్రజల చూపుల వల్ల తాను అభద్రతా భావానికి లోనవుతున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వీడియో వైరల్ కావడంతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్పందించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు వెల్లడించారు. బాధితురాలు ధైర్యంగా సోషల్ మీడియాలో ఫిర్యాదు చేయడాన్ని ఆయన అభినందించారు. ప్రస్తుతం సీసీటీవీ ఫుటేజీలు, ఇతర ఆధారాల ద్వారా నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అతడిని అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు మహిళలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 100 కు డయల్ చేయాలని పోలీసులు సూచించారు. సకాలంలో సమాచారం అందితే నిందితులను పట్టుకోవడం సులభమవుతుంది. ఫిర్యాదు చేయడానికి వెనుకాడొద్దు, మీ భద్రతే మా ప్రాధాన్యత అని ఆయన నగరవాసులకు భరోసా ఇచ్చారు. పబ్లిక్ ప్రదేశాల్లో భద్రతను మరింత కఠినతరం చేసేందుకు నిరంతర నిఘా ఉంచుతామని పోలీసులు తెలిపారు.

విజయ్ సాయిరెడ్డి టార్గెట్ ఎవరు?

నెల్లూరు : అసలు విజయసాయిరెడ్డి లక్ష్యం ఏంటి? ఆయన రాజకీయ పార్టీ ఎందుకు పెడుతున్నారు? మీడియా ఛానల్ ఏర్పాటు వెనుక ఉన్న అసలు కారణం ఏంటి? పొలిటికల్ సర్కిల్లో ఇదే ప్రచారం నడుస్తోంది. ఇప్పటివరకు పార్టీలు ప్రకటించిన వారంతా చరిష్మ ఉన్నవారు. కానీ విజయసాయిరెడ్డి విషయానికి వచ్చేసరికి ఆయన కేవలం జగన్మోహన్ రెడ్డి వెనుక పని చేశారే తప్ప.. ఆయనకంటూ ఒక సొంత ఇమేజ్ లేదు. పైగా వివాదాస్పద ముద్ర ఉంది.

కానీ రాజకీయ పార్టీ ఏర్పాటు వెనుక అసలు వ్యూహం ఏంటనేది తెలియడం లేదు. పైగా మీడియా ఛానల్ ఏర్పాటుకు సమాంతరంగా రాజకీయాలు చేస్తామనడం మాత్రం ఏదో ఒక లక్ష్యంతో అన్నట్టు కనిపిస్తోంది. కచ్చితంగా ఎవరినో ఒకరిని టార్గెట్ చేసి ఈ చర్యకు దిగినట్లు అర్థమవుతోంది. ఒకవేళ జగన్ మోహన్ రెడ్డి వెనుక ఉండి ఇలా చేయిస్తారు అనుకోవడం ఎంత మాత్రం సహేతుకం కాదు. ఎందుకంటే జగన్మోహన్ రెడ్డికి మీడియా ఉంది. ఆయన పార్టీ ప్రతిపక్షంలో ఉంది. ఈ సమయంలో విజయసాయిరెడ్డి పార్టీ పెడితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కరం. పైగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. ఆపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో నెంబర్ 2 గా ఎదిగిన నాయకుడు. ఆయన పార్టీ పెడితే తప్పకుండా ఆ ప్రభావం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఉంటుంది. పైగా విజయసాయిరెడ్డి తో జగన్మోహన్ రెడ్డి పార్టీ పెట్టిస్తే అది అంతిమంగా వైసీపీకి నష్టం. ఇప్పటికే వైసీపీకి సాక్షి మీడియాతో పాటు అనుకూల మీడియా చాలా వరకు ఉంది. కొత్తగా విజయసాయిరెడ్డితో మీడియాను ఏర్పాటు చేసే అవసరం జగన్మోహన్ రెడ్డికి ఎంత మాత్రం లేదు.పోనీ చంద్రబాబు ఇలా చేయిస్తున్నారు అంటే మాత్రం కొంతవరకు నమ్మవచ్చు. ఎందుకంటే చంద్రబాబుతో సాయి రెడ్డికి బంధుత్వం ఉంది. నందమూరి తారకరత్న భార్యకు విజయసాయిరెడ్డి స్వయానా చిన్నాన్న అవుతారు. అప్పట్లో తారకరత్న చనిపోయే సమయంలో విజయసాయి-రెడ్డి అన్ని తానై వ్యవహరించారు. అటు చంద్రబాబుతో పాటు నందమూరి బాలకృష్ణ సైతం విజయసాయిరెడ్డి తో ప్రత్యేకంగా గడపాల్సి వచ్చింది. అటు తరువాతనే జగన్మోహన్ రెడ్డితో విజయసాయి రెడ్డికి ఒకలాంటి గ్యాప్ ఏర్పడింది. పార్టీకి దూరమైన క్రమంలో విజయసాయిరెడ్డి పై జగన్మోహన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు కూడా చేశారు. ఇవన్నీ చంద్రబాబుతో విజయసాయిరెడ్డి దగ్గర కావడం వల్ల జరిగిన పని అంటూ అనుమానాలు ఉన్నాయి. అందుకే చంద్రబాబు విజయసాయిరెడ్డి తో ఈ పని చేయించి ఉంటారన్న అనుమానాలకు ఎంతో కొంత బలం చేకూరుస్తోంది.అయితే ఏకకాలంలో మీడియా ఏర్పాటుతో పాటు కొత్త రాజకీయ పార్టీ ప్రకటన చేశారు విజయసాయి-రెడ్డి. అయితే గెలుపు ఓటములను పక్కన పెడితే విజయసాయిరెడ్డి ఎవరినో విపరీతంగా టార్గెట్ చేసుకున్నట్టు కనిపిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి కోసం ఎంత చేయాలో అంత చేశారు విజయసాయిరెడ్డి. 16 నెలల జైలు జీవితాన్ని గడిపారు జగన్మోహన్ రెడ్డి తో కలిసి. వైసీపీ నే అధికారంలోకి తెచ్చేందుకు సర్వశక్తులు వడ్డారు. గౌరవభావం సంపాదించుకున్నారు. పదవులు అనుభవించారు. కానీ ఇవన్నీ నాణానికి ఒకవైపే. జగన్మోహన్ రెడ్డి వల్ల గౌరవ భావాన్ని కోల్పోయారు. కేసులను ఎదుర్కొన్నారు. అవమానాలు కూడా పడ్డారు. అయితే తన ఈ పతనానికి జగన్మోహన్ రెడ్డి కారణం అన్నది విజయసాయిరెడ్డి ఆలోచనగా తెలుస్తోంది. అందుకే ఆయనను టార్గెట్ చేసుకుని మీడియాతో పాటు కొత్త పార్టీ ఏర్పాటు అన్నది ఒక అనుమానం. దీనిలో ఎంత నిజం ఉందో తెలియాలి.

వివాదం అవుతున్న స్టాండప్ కామెడీ

తిరుపతి: ఇటీవల స్టాండప్ కామెడీవివాదాస్పదం అవుతోంది. మొన్న మధ్యన స్టాండప్ కమెడియన్ ఒకరు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయన అరెస్ట్ కూడా జరిగింది. ఆ ఘటన మరువకముందే.. అటువంటి ఘటనే ఒకటి చోటుచేసుకుంది. టిడిపి అధినేత చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తెలుగుదేశం మద్దతుదారులు హైదరాబాద్ కు చెందిన స్టాండప్ కమెడియన్ శరత్ ఉదయ్ కామెడీ షో ను అడ్డుకున్నారు. రెండేళ్ల కిందట చంద్రబాబుపై శరత్ ఉదయ్ చేసిన కామెడీ అభిమానుల్లో ఆగ్రహం నింపింది. ఇప్పుడు అదే శరత్ ఉదయ్ కామెడీ షో ను టిడిపి నేతలు అడ్డుకోవడం కూడా సంచలనంగా మారింది.చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2003లో నక్సలైట్లు దాడి చేసిన సంగతి తెలిసిందే. తిరుమలలో శ్రీవారిని దర్శించుకునేందుకు గాను వెళ్తున్న చంద్రబాబు వాహనంపై బాంబుతో దాడి చేశారు. క్లైమరా మైన్స్ పెట్టి వాహనాన్ని తేల్చే ప్రయత్నం చేశారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనం కావడంతో గాయాలతో బయటపడ్డారు చంద్రబాబు నాడు. అయితే స్టాండప్ కామెడీలో భాగంగా? రెండేళ్ల కిందట నక్సలైట్ల దాడిని ప్రస్తావిస్తూ శరత్ ఉదయ్ జోక్ చేశాడు. దీనిపై అప్పట్లోనే తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి డిమాండ్ మేరకు దానిపై అప్పట్లోనే శరత్ ఉదయ్ క్షమాపణలు చెప్పాడు. దీంతో అంతటితో ఆ వివాదం ముగిసిపోయిందని అంతా భావించారు.మ-రోసారి క్షమాపణ చెప్పించిన వైనం బెంగళూరులోని కోరమంగళ లో శనివారం రాత్రి 7 గంటల సమయంలో శరత్ ఉదయ్ స్టాండప్ కామెడీ షో ప్రారంభం అయింది. ఈ క్రమంలో ప్రేక్షకుల నుంచి ఓ వ్యక్తి శరత్వతయు వద్దకు చేరుకున్నాడు. తాను మీ అభిమాని నంటూ పరిచయం చేసుకున్నాడు. మీరు బాగా కామెడీ చేస్తారని.. అయితే ఒక షోలో తమ నాయకుడిని అవమానించారని అన్నారు. ఆ వెంటనే మరో ఇద్దరు వ్యక్తులు అతనితో చేరారు. శరత్ ఉదయ్ ను బెదిరించడం ప్రారంభించారు. ఆ తర్వాత వారితో మరికొంతమంది చేరారు. అయితే అప్పట్లోనే తాను క్షమాపణలను కోరినట్లు శరత్ ఉదయ్ చెప్పారు. అయినా సరే వారు వినలేదు. చంద్రబాబుతో పాటు లోకేష్ కు ఆయనతో క్షమాపణలు చెప్పించారు. చంద్రబాబు నాయుడు గారికి, నారా లోకేష్ గారికి క్షమాపణలు చెబుతున్నాను. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను కూడా క్షమాపణ కోరుతున్నానని' వీడియో రికార్డింగ్‌లో శరత్ ఉదయ్ మరోసారి సారీ చెప్పారు. అంతటితో ఆగకుండా జై తెలుగుదేశం, జై చంద్రబాబు అనాలని అతడిపై టీడీపీ కార్యకర్తలు ఒత్తిడి పెంచారు. చేసిన వ్యాఖ్యలపై తప్పిదానికి క్షమాపణ చెబుతా కానీ, మీ పార్టీకి, నేతకు జై కొట్టాలని ఎలా అడుగుతారని.. తాను వైసీపీ నేతలపై సైతం జోక్స్ వేశానని శరత్ ఉదయ్ గుర్తుచేశాడు. మరోసారి జాగ్రత్తగా మాట్లాడాలని అతడికి వార్నింగ్ ఇచ్చి అక్కడినుంచి వెళ్లిపోయారు. సారీ చెప్పాను కదా.. ఇక నా షో నుంచి వెళ్లిపోండి అని టీడీపీ మద్దతుదారులకు అతడు సూచించగా.. టికెట్ డబ్బులు తిరిగిస్తావా అని వాళ్లు అడిగారు. మీ డబ్బులు తిరిగిచ్చేస్తా, మొత్తం ఎంత మంది వచ్చారని అడగగా 10 మంది వచ్చామన్నారు. వారికి పేమెంట్ చేసి అక్కడి నుంచి పంపించేశారు. తమకు డబ్బులు ముఖ్యం కాదని మరోసారి చంద్రబాబు, నారా లోకేష్ గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండకపోతే ఈసారి పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయవద్దని హెచ్చరించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

జనసేనలో ఏం జరుగుతోంది...

విజయవాడ : రాజకీయ నాయకుడైనా అధికారంలో ఉన్న పార్టీ నుంచి వెళ్ళిపోవడం చాలా అరుదు. కానీ జనసేన పార్టీలో లో గొంతు ఎత్తి మాట్లాడే నేతలందరి మీద ఎన్నికల తర్వాత తీవ్ర ఆరోపణలు రావడం లేదా పార్టీ నుంచి వెళ్ళిపోవడం చూస్తుంటే నిజమే అనిపిస్తుంది. ఈ ఆరోపణలు తర్వాత వాళ్ళు పార్టీలో ఉన్న ఇంతకు ముందులా బలంగా మాట్లాడగలరా? మాట్లాడిన వారి మాటల్ని జనాలు ఎంతవరకు విశ్వసిస్తారు అనే అనుమానం వస్తుంది.

పార్టీ ఆవిర్భవించిన తర్వాత అనేక మంది నేతలు పార్టీని విడిచివెళ్లిపోయారు. వారిలో ఎక్కువ మంది కాపు సామాజికవర్గానికి చెందిన వారే కావడం విశేషం.కోట వినుత, కిరణ్ రాయల్, అరవ శ్రీధర్, బొలిశెట్టి సత్యనారాయణలు ఇటీవల కాలంలో పార్టీ నుంచి బయటకు పంపారు. అయితే వీరిలో కొందరు అనవసర వివాదాల్లో చిక్కుకోవడంతో వారిని పార్టీకి దూరంగా పెట్టారు. అందులో తప్పుపట్టాల్సిన పనిలేదు. కానీ జనసేన కోసం నిలబడి పార్టీ కోసం ఒళ్లు, ఇల్లూ హూనం చేసుకున్న వారిని సయితం బయటకు పంపుతుండటం జనసేనలో చర్చనీయాంశమైంది. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత జనసేనను వీడే నేతలు ఎక్కువగా ఉంటారని ఆ పార్టీ నేతలే సోషల్ మీడియాలో బహిరంగంగా చెబుతున్నారంటే నాయకత్వం కొంత ఆలోచన చేసుకోవాల్సిన అవసరం ఉంది.నియోజకవర్గాల్లో జనసేన కార్యకర్తలతో పాటు నేతలు కూడా సంతృప్తి కరంగా లేరు. అందుకే పవన్ కళ్యాణ్ పై విమర్శలు ఎవరు చేసినా పెద్దగా స్పందన రావడం లేదు. అధికారంలో ఉన్నప్పటికీ పనులు అవ్వటం లేదన్న అసంతృప్తి పార్టీ ఎమ్మెల్యేల్లో, నాయకులలో కూడా ఉంది. కిందస్థాయిలో చిన్న చిన్న పనులు కూడా చేయించుకో లేకపోతుండటం వారిని బాధిస్తుంది. జెండా మోసిన తమకు కలిగే ప్రయోజనం ఏంటన్నది వారిలో కలుగుతుంది. అయితే ఇదంతా ఒక పద్ధతి ప్రకారం జరుగుతుందా? అనే అనుమానం నాయకత్వంలోనూ కలుగుతుంది. జనసేనను కాపాడుకోవాల్సిన బాధ్యత పవన్ కళ్యాణ్ తో పాటు రాష్ట్ర నాయకత్వంపై ఉంది. లేకుంటే రాజకీయ ఇబ్బందులు తప్పవు.

కాంగ్రెస్ పార్టీలో చేరడం రిస్కీ పని

యువతి సమాధానంతో రాహుల్ గాంధీ నవ్వులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: మీ జీవితంలో మీరు చేసిన అత్యంత రిస్కీ పని ఏమిటి? అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించగా, ఓ విద్యార్థిని నుంచి ఊహించని సమాధానం వచ్చింది. దీనితో అక్కడ కొన్ని క్షణాలు నవ్వులు విరబూశాయి. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.ఢిల్లీ యూనివర్సిటీ, గార్గీ కాలేజీలకు చెందిన విద్యార్థినులతో రాహుల్ గాంధీ ముచ్చటించారు. ఆ సమయంలో "మీరు చేసిన అత్యంత సాహసోపేతమైన పని ఏమిటి?" అని విద్యార్థినులను రాహుల్ గాంధీ ప్రశ్నించారు.అక్కడున్న వారిలో ఒక విద్యార్థిని స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీలో చేరడం అత్యంత సాహసోపేతమైనదని పేర్కొన్నారు. ఈ సమాధానంతో రాహుల్ గాంధీ కూడా నవ్వేశారు. "అవును, అది నిజంగా సాహసోపేతమైనదే" అంటూ బదులిచ్చారు. దీంతో రాహుల్ గాంధీతో పాటు విద్యార్థినులందరూ సరదాగా నవ్వారు. రాహుల్ గాంధీ యువ ఓటర్లతో మమేకవ్వడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో కాలేజీ విద్యార్థినులతో జరిగిన కార్యక్రమంలో ఈ సరదా సంభాషణ జరిగింది.

నారా లోకేశ్ కు పెద్ద సవాల్

గుంటూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి నారా లోకేశ్ కు పెద్ద సవాల్ అని చెప్పాలి. ఇప్పటి వరకూ చంద్రబాబు ఇమేజ్ పైనే పార్టీ ఇన్నాళ్లు గెలుస్తూ వచ్చింది. నాలుగు సార్లు అధికారంలోకి వచ్చింది. అయితే రానున్న కాలంలో లోకేశ్ నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లనున్నారన్నది అందరికీ తెలిసిన విషయమే. టీడీపీ ఇప్పటికే లోకేశ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. 2029 ఎన్నికలు లోకేశ్ నాయకత్వంలోనే జరగనున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి మ్యానిఫేస్టో రూపకల్పన వరకూ ఆయనే అన్నింటికీ పర్యవేక్షణ వహిస్తారు. లోకేశ్ పార్టీ క్యాడర్ విశ్వాసాన్ని బలంగా పొందగలిగారు.అయితే ప్రజల నమ్మకాన్ని పొందాల్సి ఉంటుంది. చంద్రబాబు ఇమేజ్ తో, అనుభవంతో పోల్చుకుంటే లోకేశ్ కు ఇప్పట్లో సాధ్యం కాదు. ఒకరకంగా లోకేశ్ విపక్ష నాయకుడు జగన్ కంటే తక్కువ రాజకీయ అనుభవం ఉన్న వారి కిందే జనం చూస్తారు. పార్టీని నడపగలగడం అంత ఆషామాషీ కాదు. గెలిస్తే పూలదండలు..ఓడితే అవే చేతులు రాళ్లు వేస్తాయన్నది లోకేశ్ మర్చి పోకూడదు. చంద్రబాబు నాయుడు పార్టీ పగ్గాలు చేపట్టే నాటికీ, లోకేష్ బాధ్యతలు స్వీకరిస్తున్న సమయానికి చాలా తేడా ఉంది. ఒకరకంగా చెప్పాలంటే సంబంధమే లేదు. చంద్రబాబు గద్దెనెక్కే సమయంలో కూడా ఎన్టీఆర్‌ను బలవంతంగానే గద్దె దించవలసి వచ్చింది. శాసనసభ్యులు తీసుకున్న ఆ నిర్ణయాన్ని పార్టీ శ్రేణులు ఆహ్వానించటం చంద్రబాబు సాధించిన విజయాల్లోకే ఘనవిజయం. పార్టీ శ్రేణులు కూడా చంద్రబాబును ఆహ్వానించి నాయకత్వ మార్పిడిని, బాబు నాయకత్వాన్ని ఆమోదించాయి.ప్రస్తుతం లోకేశ్ నాయకత్వ బాధ్యతలను స్వీకరించే సమయానికి చంద్రబాబు పూర్తిగా ఫిట్ గా, ఆరోగ్యంగా ఉన్నారు. పవన్ కల్యాణ్ కూడా మరో పదిహేనేళ్లు అనుభవమున్న చంద్రబాబు నాయకత్వమే రాష్ట్రానికి అవసరమని పదేపదే చెబుతున్నారు. మరొకవైపు జగన్ పాలనలోని లోపాలు కలసి వస్తాయని భావించినా అవి ఎంత వరకూ అనేది ఇప్పుడే చెప్పలేం. అటువంటి పరిస్థితుల్లో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంటుగా బాధ్యతలు స్వీకరిస్తున్నాడు లోకేశ్. బాధ్యతను తీసుకుంటున్న సమయానికి చుట్టూ ఎటు చూసినా ఆహ్లాదంగానే కనిపిస్తున్నది. ?కానీ ఇప్పుడు నడుస్తున్నది చాలా సంక్లిష్ట రాజకీయం. దీనిని లోకేశ్ ఎలా అధిగమిస్తారోనన్నది చూడాలి. నారా లోకేష్ విశాఖ విమానాశ్రయంలోప్రత్యక్షం అయ్యారు. చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు భారీగా తరలి వచ్చాయి విమానాశ్రయానికి. పెద్ద ఎత్తున స్వాగతం పలికాయి. అసలు లోకేష్ ఎక్కడికి వెళ్లారు? అనే చిక్కుముడి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వీడలేదు. లోకేష్ వెళ్ళింది వ్యక్తిగత పర్యటన నిమిత్తం. దానిని కూడా తట్టుకోలేకపోతోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ గోప్యత వెనుక ఉన్న కారణం ఏంటి అనేది ఆ పార్టీకి అంతుపట్టడం లేదు. దీనికి తోడు విశాఖ విమానాశ్రయంలో లోకేష్ స్వాగతం చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైండ్ బ్లాక్ అవుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఈ రకమైన ఆందోళన కోసమే లోకేష్ పర్యటనను గోప్యంగా ఉంచినట్లు అర్థం అవుతోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన జరగనుంది. లోకేష్ ప్రత్యేక చొరవతోనే ఈ డేటా సెంటర్ విశాఖకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు ప్రత్యుత్తరాలు జరుపుతూ.. పట్టు గూగుల్ సంస్థతో ప్రభుత్వం తరుపున చర్చిస్తూ.. ఒప్పించడంలో లోకేష్ పాత్ర ఉంది. ఈనెల 18 నుంచి కనిపించకుండా పోయిన లోకేష్ ఈరోజు విశాఖ ఎయిర్పోర్ట్లో ప్రత్యక్షం అయ్యారు. జాబ్ క్రియేటర్ ఆఫ్ చీఫ్ అంటూ పెద్ద ఎత్తున ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. లోకేష్ కు స్వాగతం పలకడం విశేషం. అసలు ఏం జరుగుతుందో వైసీపీకి అర్థం కాని పరిస్థితి.

దేశ వైద్య రంగంలో

తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : దేశంలోని వైద్య రంగంలో 50 శాతానికి పైగా సేవలు తెలంగాణ నుంచి అందించాలన్న లక్ష్యంతో రాష్ట్రంలోని ఆసుపత్రులు మరింత అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన విధానపరమైన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. వైద్య రంగం అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేసిన అపోలో హాస్పిటల్ ను మంత్రి దామోదర రాజనర్సింహ తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి తో పాటు యాజమాన్యాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.మెడికల్ టూరిజం కోసం ఇప్పటి వరకు ప్రత్యేక పాలసీ లేకపోయినా తమ ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకొచ్చిందని తెలిపారు. వైద్య రంగ అభివృద్ధికి అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. మెడికల్ టూరిజం మరింతగా వృద్ధి చెందేందుకు పశ్చిమాసియా దేశాలతో నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించాలంటూ ప్రధానమంత్రి పౌర విమానయాన శాఖ మంత్రిని కోరినట్లు వెల్లడించారు.దేశంలో 50 శాతానికి పైగా వైద్య సౌకర్యాలు తెలంగాణ నుంచే అందేలా ఎలాంటి లోపాలు లేకుండా విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం పూర్తి భద్రత కల్పిస్తుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగీతా రెడ్డి,శోభనా కామినేని, ఉపాసన కొణిదెల పాటు ఇతర యాజమాన్య ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

రద్దీకి తగ్గట్టుగా పెరగని జనరల్ బోగీలు

హైదరాబాద్ : వేసవి సెలవుల రద్దీ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వేలో జనరల్ భోగీల సంఖ్య పెంచకపోవడంతో సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పేద, దిగువ మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు రైలు ప్రయాణంలో నరకం చూస్తున్నారు. రైల్వే బోర్డు కేవలం ఆదాయం పెంచుకోవడంపై చూపుతున్న శ్రద్ధ, సామాన్య ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.సెలవుల రద్దీ కారణంగా ప్రస్తుతం జనరల్ భోగీల సామర్థ్యానికి రెండు, మూడు రెట్లు అధికంగా ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. కూర్చోవడం మాట పక్కన పెడితే, కనీసం నిలబడటానికి కూడా చోటు లేని పరిస్థితి నెలకొంది. నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ అయిన కాచిగూడ నుంచి నిత్యం 100కు పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.సాధారణ రోజుల్లో 55 వేల మంది ప్రయాణించగా, సెలవు దినాల్లో ఈ సంఖ్య 65 వేలు దాటుతోంది. రైల్వే అధికారులు ఏసీ, రిజర్వేషన్ భోగీల సంఖ్యను పెంచుతూ, జనరల్ భోగీలను తగ్గిస్తున్నారు. రిజర్వేషన్ దొరకని వారు తప్పనిసరి పరిస్థితుల్లో జనరల్ కోచ్‌లను ఆశ్రయించి ఇక్కట్లు పడుతున్నారు.

బంగారం ఆస్తే...

బంగారం కొనుగోలు విషయంలో భారతీయుల ట్రెండ్ మారుతోంది. ఒకప్పుడు బంగారం అంటే అలంకరణ సాధనంగానే చూసేవారు, నగలనే అధికంగా కొనుగోలు చేసేవారు. అయితే, పసిడి ధరలు రికార్డ్ గరిష్ఠాలకు చేరిన క్రమంలో బంగారాన్ని పెట్టుబడిగా పరిగణిస్తున్నారు. బంగారంలో పెట్టుబడి పెడితే అధిక లాభం పొందొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. గతంలో పరుగులు పెట్టిన రెండు లోహాల ధరలు.. ఇప్పుడు క్రమంగా దిగి వస్తున్నాయి. ధరలు తగ్గడం మహిళలకు కొంత ఉపశమనం కలిగించినట్లే. అయితే దేశీయ మార్కెట్లో గత మూడు రోజులుగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఏప్రిల్ 28న కూడా స్వల్పంగా తగ్గాయి. గత వారం రోజులుగా భారీగా తగ్గిన ధరలు ఒక్కసారి మాత్రమే పెరిగాయి. అంటే ఇదే మంచి అవకాశంగా చెప్పవచ్చు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరగడం, క్రూడ్ ఆయిల్ ధరలు రికార్డ్ స్థాయిలోనే ఉండడం వంటివి బంగారం ధరలు తగ్గేందుకు కారణమవుతున్నట్లు బులియన్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ నెలలో 24న బంగారం ధరలు కాస్త పెరిగినట్లు కనిపించినా రికార్డ్ గరిష్ఠాలకు చాలా దూరంగానే ఉన్నాయి2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి చేరినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ముందు ముందు ఇది మరింత పెరగవచ్చు నివేదిక తెలిపింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో బంగారం ధరలు రికార్డ్ స్థాయికి చేరుకున్నాయి. ఏడాది కాలంలోనే ఊహించని విధంగా పెరిగాయి. ఈ క్రమంలో భారతీయులు బంగారం కొనుగోలు చేసే దృక్పథం మార్చుకుంటున్నారని ప్రముఖ రేటింగ్స్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో గత ఏడాది 2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి ఎగబాకినట్లు తెలిపింది. అంతకు ముందు ఏడాది వరకు అది 30 శాతానికి లోపే ఉండాదని, మిగితా 70 శాతం పైన అలంకరణ కోసం బంగారు ఆభరణాలు మాత్రమే కొనుగోలు చేసే వారని పేర్కొంది. అయితే, ధరలు పెరుగుతుండడం వంటి కారణాలతో నగలకు బదులుగా ఆస్తులకు ప్రాధాన్యత ఇస్తూ పెట్టుబడులు పెడుతున్నారని పేర్కొంది.గత ఏడాదిలో పెట్టుబడుల కోసం మేలిమి బంగారం కొనుగోళ్లు, డిజిటల్ విధానంలో కొనుగోళ్లు అనేవి ఎక్కువగా జరిగాయని కేర్ ఎడ్జ్ నివేదిక పేర్కొంది. బంగారం ఈటీఎఫ్‌ల ద్వారానే ఏకంగా 37.5 టన్నుల బంగారానికి సమానమైన పెట్టుబడులు వచ్చినట్లు తెలిపింది. గత 10 సంవత్సరాల కాలంలో వచ్చిన మొత్తం పెట్టుబడుల కంటే ఇది ఎక్కువగా ఉండడం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరం లోనూ మొత్తం బంగారం వినియోగంలో పెట్టుబడుల విలువ 35-40 శాతం వరకు ఉండవచ్చని అంచనా వేసింది. 2026లోనూ బంగారం ధరలు గరిష్ఠ స్థాయుల్లోనే కొనసాగుతాయని కేర్ ఎడ్జ్ డైరెక్టర్ అఖిల్ గోయల్ అంచనా వేశారు.గత ఏడాది 2025లో నగల గిరాకీ, విలువ పరంగా వార్షికంగా 10 శాతం మేర పెరిగి రూ.4.8 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. అధిక ధరల కారణంగా వినియోగదారులు తేలికైన, తక్కువ క్యారెట్ల ఆభరణాలకు మొగ్గు చూపుతున్నారని, అలాగే ఈ లోహాల అమ్మకాల పరిమాణ 15 శాతం మేర పడిపోయినట్లు నివేదిక వెల్లడించింది. 2025-26 ఆర్థిక ఏడాదిలో ఆభరణాల పెద్ద వ్యాపారులు 35 శాతం ఆదాయ వృద్ధిని నమోదు చేయగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో అది 20-25 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసిందిఈ ట్రెండ్ భారత్‌కు మాత్రమే పరిమితం కాలేదని, ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ధోరణి మారుతోందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. 2025లో బంగారం పెట్టుబడుల డిమాండ్ 2175 మెట్రిక్ టన్నులకు చేరిందని, అది అంతకు ముందు 2020లోని 1805 టన్నులను మించినట్లు తెలిపింది. ఇందులో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ వాటానే ఎక్కువగా ఉందని తెలిపింది. అలాగే బంగారు కడ్డీలు, నాణెల కొనుగోలు సైతం పెరిగిందని, అది 12 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకుందని తెలిపింది. భారత్‌లోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు భారీగా వస్తున్నట్లు నివేదిక తెలిపింది. 2025 ఒక్క ఏడాదిలోనే 37.5 టన్నులకు సరిపడా పెట్టుబడులు వచ్చాని పేర్కొంది.అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇండియా గోల్డ్ పాలసీ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ సుందరవల్లి నారాయణస్వామి అంచనాల ప్రకారం ఆర్‌బీఐ వద్ద సుమారు 800-820 టన్నుల బంగారం ఉంది. అలాగే దేశంలో ఆర్థికంగా వెలికితీయగల బంగారం సుమారు 70-80 టన్నులు మాత్రమే" అని ఆయన చెప్పారు.ఆర్థికంగా వెలికితీయగల బంగారం అంటే ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో లాభదాయకంగా తవ్వి తీసుకోగల బంగారం అని అర్థం.భారత్‌లో మంచి నాణ్యత గల బంగారం తక్కువగా ఉంది, కాబట్టి ఇక్కడ మైనింగ్ పోటాపోటీగా ఏమీ జరగదు" అని ప్రొఫెసర్ సుందరవల్లి అంటున్నారు."భారతీయుల దగ్గర చాలా బంగారం ఉంది. ఎంత బంగారం ఉందనే విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ అది సాధారణంగా 25 వేల నుంచి 27 వేల టన్నుల వరకు ఉంటుందని భావిస్తున్నారు" అని ఆయన అన్నారు.ఈ అంకెకు ఆధారం ఏంటని అడగ్గా, ఇది చాలా మంది నమ్మే ఒక సాధారణ అంచనా మాత్రమే అని ఆయన అన్నారు."ప్రతిఏటా 600 నుంచి 700 టన్నుల బంగారం దిగుమతి అవుతుండగా, ఎగుమతి చాలా తక్కువ. అందుకే ఈ బంగారం ఇళ్లలో ఉండిపోయింది" అని ఆయన చెప్పారు.భారత్ వద్ద 2026 ఫిబ్రవరి నాటికి అధికారికంగా సుమారు 880 టన్నుల బంగారం ఉన్నట్టు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ పేర్కొంది.ఈ విషయంలో భారత్ ప్రపంచంలో 9వ స్థానంలో ఉంది. దీనికంటే ముందు అమెరికా, జర్మనీ, అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ఇటలీ, ఫ్రాన్స్, రష్యా, చైనా, స్విట్జర్లాండ్ ఉన్నాయి.అయితే అధికారిక నిల్వలు భారతదేశపు బంగారు కథలో ఒక భాగం మాత్రమే."మన దగ్గర సుమారు 50 కోట్ల టన్నుల పసిడి ధాతువు (అంటే బంగారం కలిగిన రాయి/మట్టి) ఉంది, కానీ ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది" అని థరూర్ తన వ్యాసంలో రాశారు.దేశంలో మొత్తం 518.23 మిలియన్ టన్నుల పసిడి ధాతువు ఉన్నట్టు నేషనల్ మినరల్ ఇన్వెంటరీ చెబుతోంది.అయితే దీనర్థం ఈ పసిడిధాతువునంతటినీ వెలికి తీయడం తేలికైన పని అని కాదు. ఇందులో 494.50 మిలియన్ టన్నుల బంగారం వెలికితీయడం కష్టమైనది కాగా, 23.72 మిలియన్ టన్నులను మాత్రం రిజర్వ్‌గా పరిగణిస్తారు.రిజర్వ్ అంటే బంగారాన్ని వెలికితీయడం లాభదాయకంగానూ, సులభంగా సాధ్యమయ్యే స్థితి.

నిర్ణయాలు... బౌన్స్ అవుతున్నాయా....

విజయవాడ: వైఎస్ జగన్ నిర్ణయాలను ఆ పార్టీ నేతలే తప్పు పడుతున్నట్లుగానే ఉంది. ప్రధానంగా మావిగన్ తో పాటు అనేక అంశాల విషయంలో జగన్ తీసుకునే నిర్ణయాలు సహేతుకంగా లేవని పార్టీ నేతలే ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. మావిగన్ విషయంలో వైసీపీ కీలక నేత ఒకరు జగన్ పై చేసిన వ్యాఖ్యలను టీడీపీ సోషల్ మీడియా వైరల్ చేస్తుంది. అయితే తాను ఆ వ్యాఖ్యలను చేయలేదని నేత చెబుతున్నప్పటికీ ఎక్కువ మంది అభిప్రాయం అలాగే ఉందన్న అభిప్రాయం టీడీపీ బలంగా సోషల్ మీడియాలో వైరల్ చేస్తుంది. ఏదైనా ఒక కీలక ప్రకటన చేసే ముందు ముఖ్యమైన నేతలను, ఆ ప్రాంతనేతలతో సంప్రదించడానికి జగన్ కు ఏం ఇగో అడ్డమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.దీని ప్రకారం చూస్తే వైసీపీ నేతలే మావిగన్ ప్రతిపాదనను వ్యతిరేకించారంటే మిగిలిన ప్రాంత నేతలు ఎందుకు వ్యతిరేకించరన్నది అర్థమవుతుంది. అయితే జగన్ లో తొలి నుంచి ఒక లోపం స్పష్టంగా కనపడుతుంది. అన్నీ ఏకపక్ష నిర్ణయాలే. తనకు తోచింది మీడియా ముందు చెబుతారు. అధికారంలో ఉన్నప్పుడు అమలు చేశారు. విపక్షంలో ఉన్నప్పుడు నిర్ణయాలను ప్రకటిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు వాలంటీర్ల వ్యవస్థపై పార్టీ సీనియర్ నేతలతో పాటు అందరి నిర్ణయాలను తీసుకుంటే బాగుండేది. అలాగే ఎన్నికల సమయంలో సీట్లను మార్పు చేసినప్పుడు కూడా సీనియర్ల సలహాలు తీసుకోవచ్చు.అసలు వైసీపీకి ఒక పొలిట్ బ్యూరో ఉందో లేదో తెలియదు. ఏ విషయం కూడా జగన్ సీనియర్ నేతలతో చర్చించే అలవాటు లేదు. ఇదే ఆయన నిర్ణయాలు బూమ్ రాంగ్ అవుతున్నాయి. గతంలో మూడు రాజధానుల విషయంలోనూ, వాలంటీర్ల వ్యవస్థ విషయంలోనూ, అభ్యర్థుల ఎంపికలోనూ, చివరకు మావిగన్ వరకూ అన్నీ సొంత నిర్ణయాలేనా? ఎవరైనా ఇచ్చిన ఐడియాలా? అన్నది పక్కన పెడితే మొత్తం మీద జగన్ ఏకపక్ష నిర్ణయాలు పార్టీలో అసంతృప్తిని, అసహనాన్ని పరోక్షంగా వెళ్లగక్కు తున్నారు. ఇప్పటికైనా జగన్ గుర్తించి తగిన సలహాలు, సూచనలు సీనియర్ల నుంచి తీసుకుంటే బాగుంటుందన్న సూచనలు వెలువడుతున్నాయి.

ట్రెండింగ్ లో జగన్

జగన్మోహన్ రెడ్డి సాధారణ సంప్రదాయ విస్తరణకు విరుద్ధంగా.. ట్రెండీ లుక్ లో కనిపించారు. జీన్ ప్యాంటు తో పాటు జీన్స్ షర్టుతో.. ఖరీదైన వాచీ తో పాటు షూస్ తో ఒక కొత్త లుక్ లో కనిపించారు జగన్మోహన్ రెడ్డి. ఆయనతో ఫోటోలు దిగేందుకు బెంగళూరు ఎయిర్ పోర్ట్ లో ప్రయాణికులు బారులు తీరారు. వారితో సెల్ఫీలు దిగారు జగన్మోహన్ రెడ్డి. జగన్ న్యూ ట్రెండీ లుక్ తో కూడిన ఫోటోలను, వీడియోలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు వైరల్ చేస్తున్నారు. అయితే ఈ క్రమంలో జగన్మోహన్ రెడ్డి ధరించిన షూస్ ధరపై రకరకాల ప్రచారం నడుస్తోంది.సాధారణంగా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు వైట్ కలర్ షర్టుతో పాటు గోధుమ రంగుతో కూడిన ఫ్యాంటును ధరిస్తుంటారు జగన్మోహన్ రెడ్డి. సాధారణంగా చెప్పులతోనే ఎక్కువగా కనిపిస్తారు. అయితే విదేశీ పర్యటనకు వెళ్ళినప్పుడు మాత్రం ట్రెండీ లుక్ తో కనిపించడం జరుగుతూ ఉంటుంది. ఈసారి కూడా ట్రెండీ లుక్ తో కూడిన కొత్త జగన్ ఆవిష్కృతమయ్యారు. అయితే ఇప్పుడు ఆయన ధరించిన షూస్ పై విస్తృత ప్రచారం సాగుతోంది. ఆయన ఇటాలియన్ లగ్జరీ బ్రాండ్ జగ్నా షూస్ ధరించారు. వాటి విలువ అక్షరాల లక్ష 85 వేల రూపాయలు అని తెలుస్తోంది. రకరకాల ట్రోల్స్ ప్రారంభం అయ్యాయి.జగన్మోహన్ రెడ్డి మొన్నటి ఎన్నికలకు ముందు చాలా ఇంటర్వ్యూ లో మాట్లాడారు. తనకు కనీసం ఫోన్ కూడా లేదని చెప్పుకొచ్చారు. తాను ఒక పేద ముఖ్యమంత్రిని అని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడు 1 లక్ష 85 వేల రూపాయల షూస్ పై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. జగన్ హయాంలో వాలంటీర్లు మూడు సంవత్సరాలు పనిచేస్తే కానీ ఆ షూస్ వరకు అందుకోలేరని సోషల్ మీడియాలో అదే పనిగా ప్రచారం చేస్తున్నారు కొందరు. పేద సీఎం అంటూ కౌంటర్ అటాక్ చేస్తున్నారు. మరోవైపు ట్రెండీ లుక్ పై సైతం చాలా రకాలుగా ప్రచారం సాగుతోంది. సోషల్ మీడియాలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ అవుతోంది. దీనిపై సమాధానం చెప్పలేక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సతమతం అవుతున్నాయి.

నోబుల్ రేసులో ట్రంప్

న్యూయార్క్ : ప్రపంచంలోనే అత్యున్నత పురస్కారంగా భావించే నోబెల్ శాంతి బహుమతి 2026 సందడి మొదలైంది. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారం కోసం మొత్తం 287 మంది అభ్యర్థులు నామినేట్ అయినట్లు నార్వేజియన్ నోబెల్ కమిటీ అధికారికంగా ధ్రువీకరించింది.

అయితే ఈ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు కూడా ఉందనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా అనేక యుద్ధ వాతావరణాలు కొనసాగుతున్న తరుణంలో.. ఈసారి నోబెల్ విజేత ఎవరన్నది సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. ముఖ్యంగా ట్రంప్‌నకు ఈసారి అయినా ఈ బహుమతి దక్కుతుందా లేదా అని అంతా అనుకుంటున్నారు.నోబెల్ కమిటీ సెక్రటరీ క్రిస్టియన్ బెర్గ్ హార్ప్‌వికెన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈసారి నామినేట్ అయిన వారిలో 208 మంది వ్యక్తులు ఉండగా.. 79 సంస్థలు ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ జాబితాలో అనేక కొత్త పేర్లు చేరాయి. లోకమంతటా జరుగుతున్న సంఘర్షణల నేపథ్యంలో.. శాంతి కోసం కృషి చేస్తున్న వివిధ రంగాల ప్రముఖులను ఈ జాబితాలోకి తీసుకున్నారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు ఈ రేసులో ఉండటంపై విస్తృత చర్చ జరుగుతోంది.

3-9 మే, 2026 | జన విజయం | సంపుటి : 9 | సంచిక : 31 | ఖమ్మం | 3
3-9 May, 2026 | JANA VIJAYAM | Volume : 9 | Issue : 31 | KHAMMAM

కుక్కల రక్తంతో వ్యాపారం

హైదరాబాద్ : హైదరాబాద్ షేక్‌పేటలోని ఒక ప్రైవేట్ వెటర్నరీ హాస్పిటల్‌లో దారుణమైన 'బ్లడ్ బిజినెస్' వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వీధి కుక్కలను సంరక్షణ పేరుతో తీసుకొచ్చి.. వాటిని బోన్లలో బంధించి రక్తాన్ని సేకరిస్తూ ప్యాకెట్ రూ. 25 వేల వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన జంతు సంక్షేమ బోర్డు, జీహెచ్ఎంసీ అధికారులు విచారణ చేపట్టారు. సరైన రక్తనిధి కేంద్రాలు లేకపోవటాన్ని ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు మూగజీవాలను హింసిస్తున్న ఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.ఇప్పటి వరకు మనుషుల రక్తంతో, అవయవాలతో వ్యాపారాలు చేశారు. కిడ్నీలను ఇడ్లీల మాదిరిగా అమ్మేసిన ఘటనలు అనేకం. తాజాగా.. హైదరాబాద్ నగరంలోని షేక్‌పేట ప్రాంతంలో ఉన్న ఒక ప్రైవేట్ వెటర్నరీ హాస్పిటల్‌లో మూగజీవాలను కూడా వదలకుండా వాటి రక్తాన్ని అమ్ముకుంటున్నారు. చికిత్స, సంరక్షణ పేరుతో వీధి కుక్కలను హాస్పిటల్‌కు తీసుకువచ్చి.. బంధించి అక్రమంగా రక్తాన్ని సేకరిస్తున్నారని జంతు ప్రేమికులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై జంతు హక్కుల ఉద్యమకర్త మేనకా గాంధీ సైతం రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థకు ఫిర్యాదు చేయడంతో అధికారులు లోతైన విచారణ ప్రారంభించారు.ఆసుపత్రి సిబ్బంది ద్వారా బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు ఈ క్రూరత్వాన్ని కళ్లకు కడుతున్నాయి. నిర్వాహకులు ముందుగా వీధి కుక్కలను పట్టుకొచ్చి బోన్లలో ఉంచి పెంచుతారు. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే ఖరీదైన పెంపుడు కుక్కల యజమానులే వీరి ప్రధాన లక్ష్యం. ఆ పెంపుడు శునకాలకు అవసరం ఉన్నా లేకపోయినా రక్తహీనత ఉందని తప్పుడు రిపోర్టులు సృష్టించి యజమానులను భయాందోళనకు గురిచేస్తారు. ప్రాణాలు కాపాడాలంటే రక్తం ఎక్కించాలని నమ్మబలికి.. బోన్లలో బంధించిన కుక్కల రక్తాన్ని తీసి విక్రయిస్తారు. ఒక్కో బ్లడ్ ప్యాకెట్‌ను డిమాండ్‌ను బట్టి రూ. 18 వేల నుంచి రూ. 25 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.ఈ అమానుష ప్రక్రియలో నిరంతరం రక్తాన్ని తీయడం వల్ల ఆరోగ్యంగా ఉన్న వీధి కుక్కలు తీవ్ర రక్తహీనతకు లోనై మృత్యువాత పడుతున్నాయి. కొన్నిసార్లు వీధి కుక్కల రక్తం అందుబాటులో లేకపోతే.. చికిత్స కోసం వచ్చిన ఇతర పెంపుడు జంతువుల నుంచి కూడా బలవంతంగా రక్తాన్ని సేకరిస్తున్నట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం.. ఆరోగ్యంగా ఉన్న జంతువు యజమాని సమ్మతితోనే రక్తమార్పిడి జరగాలి. కానీ ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా.. కనీస మానవత్వం లేకుండా వ్యాపారమే పరమావధిగా బ్లడ్ బిజినెస్ దందా కొనసాగుతోంది.నగరంలో జంతువుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఇలాంటి అక్రమ వ్యాపారాలు పుట్టుకొస్తున్నాయని జీహెచ్ఎంసీ పశువైద్యాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆసుపత్రి రికార్డులను, నిల్వ ఉంచిన రక్తపు ప్యాకెట్లను అధికారులు స్వాధీనం చేసుకుని విచారణ జరుపుతున్నారు. కాగా, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

మండల స్థాయికి ప్రజావాణి

హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని, తద్వారా వేగంగా సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన మరుసటి రోజున ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి మంగళవారం, శుక్రవారం నాడు మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి విజయవంతంగా అమలవుతోంది.అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, అప్లికేషన్లు స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రజావాణి ద్వారా ఫిర్యాదుల స్వీకరణను నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎంసీహెచ్?ఆర్?డీలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సీఎస్ కె. రామకృష్ణారావుతో పాటు సీఎంవో అధికారులను ఆదేశించారు.వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించాలని చెప్పారు. తరువాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని యోచిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించడంతో పాటు పరిష్కార పురోగతిని ఆ వ్యక్తులకు తెలియజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని, తద్వారా అప్లికేషన్ పరిష్కారంలో ఆలస్యం జరగకూడదని చెప్పారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని, అప్పుడే ప్రభుత్వం నమ్మకం మరింత పెరుగుతుందన్నారు.ప్రజావాణి ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలన్నారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని సీఎస్, ఉన్నతాధికారుల్ని ఆయన ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని అధికారులకు ఆయన సూచించారు.ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిరంతరం సమీక్షలు నిర్వహించాలన్నారు. పెండింగ్ ఫిర్యాదులపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని చెప్పారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులుగా చేయాలని సూచించారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కిందిస్థాయిలోనే తక్కువ సమయంలోనే పలు సమస్యలు పరిష్కరించే వీలుంటుందని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మహానగరం

హైదరాబాద్ : హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'హెచ్-సిటీ' ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం రూ. 7,042 కోట్ల భారీ బడ్జెట్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ముఖ్యంగా కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఫ్లైఓవర్లు, అండర్ పాసుల నిర్మాణం ప్రారంభమైంది. నల్లగొండ ఎక్స్ రోడ్స్ నుంచి ఓవైసీ జంక్షన్ వరకు చేపట్టిన కీలక ఫ్లైఓవర్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. యుద్ధప్రాతిపదికన ఈ పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.హైదరాబాద్ మహా నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' పేరుతో తెలంగాణ ప్రభుత్వం భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం కింద మొదలై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులతో పాటు.. ప్రస్తుతం కొత్తగా గుర్తించిన ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ మూడు కార్పొరేషన్ల పరిధిలోని ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేసేందుకు ముగ్గురు కమిషనర్లు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రతివారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు.ఈ భారీ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం మొత్తం రూ. 7,042 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో సింహభాగం.. అంటే సుమారు రూ. 5,942 కోట్లను హెచ్-సిటీ పనులకే కేటాయించింది. ప్రధానంగా జూబ్లీహిల్స్ ప్రాంతంలోని కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి రూ. 1,090 కోట్లతో చేపట్టిన పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో రూ. 580 కోట్లతో కేబీఆర్ ఎంట్రెన్స్, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వంటి కీలక జంక్షన్లలో రెండు స్టీల్ బ్రిడ్జిలు, మూడు అండర్ పాసులను నిర్మించనున్నారు. రెండో ప్యాకేజీలో రూ. 510 కోట్లతో ఫిల్మ్ నగర్, రోడ్డు నంబర్ 45 జంక్షన్ల వద్ద మరో నాలుగు స్టీల్ బ్రిడ్జిలు, నాలుగు అండర్ పాసులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. ట్రాఫిక్ మళ్లింపులు కూడా చేపట్టారు.

మరోవైపు దక్షిణ హైదరాబాద్ ప్రజలు చాలా కాలంగా ఎదురు చూస్తున్న నల్లగొండ ఎక్స్ రోడ్స్?సైదాబాద్?ఐఎస్ సదన్ ?ఓవైసీ జంక్షన్ కారిడార్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. సుమారు 2,530 మీటర్ల పొడవుతో నిర్మిస్తున్న ఈ ప్రధాన ఫ్లైఓవర్‌ను రూ. 620 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. సైదాబాద్ నుంచి ధోబీఘాట్ జంక్షన్ వరకు ఉన్న కీలక ప్రాంతాల్లో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ, కొత్త నగరం మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. గడువులోగా ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావటమే లక్ష్యంగా, నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మార్చేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది.

చెన్నైలో హంగ్ లెక్కలు -సీఎం ఎవరనే అంశంపై బెట్టింగ్స్

చెన్నై: తమిళనాడులో గందరగోళ ఎగ్జిట్ పోల్స్ తో మధ్యేమార్గంగా హంగ్ వస్తుందని అందరూ ఫీలవుతున్నారు. టీవీకే, అన్నాడీఎంకే కూడా అదే నిర్ణయానికి వచ్చి తెర వెనుక చర్చలు ప్రారంభించాయి. ముఖ్యంగా అధికార డిఎంకె కూటమికి, అన్నాడీఎంకే కూటమికి మధ్య గట్టి పోటీ ఉండటంతో పాటు, తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం నిర్ణయాత్మక శక్తిగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే , విజయ్ పార్టీ టీవీకే మధ్య తెరవెనుక రాయబారాలు మొదలైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం కోసం ఈ రెండు పార్టీలు చేతులు కలిపేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎగ్జిట్ పోల్స్ గందరగోళంగా ఉన్నప్పటికీ, అన్నాడీఎంకే , టీవీకే కలిస్తే అధికారం చేపట్టేందుకు సరిపడా నంబర్స్ వస్తాయని ఆయా పార్టీల నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. ఫలితాల అనంతరం సంక్లిష్ట పరిస్థితి తలెత్తితే సమయం వృథా చేయకుండా వెంటనే కార్యాచరణలోకి దిగాలని ఇరు పార్టీల అగ్రనాయకత్వం భావిస్తోంది.ఈ పొత్తులో అత్యంత కీలకమైన అంశం ముఖ్యమంత్రి పదవి . విజయ్ తనను తాను సీఎం అభ్యర్థిగా ప్రకటించుకోగా, అన్నాడీఎంకే తరపున పళనిస్వామి రేసులో ఉన్నారు. ఈ ప్రతిష్టంభనను తొలగించడానికి ఇరు పార్టీల మధ్య ఒక మధ్యేమార్గంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఏ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తే, ఆ పార్టీకే సీఎం పదవి దక్కాలని, రెండో పెద్ద పార్టీకి డిప్యూటీ సీఎం పదవితో పాటు కీలక శాఖలు కేటాయించాలని ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అధికారాన్ని పంచుకోవడం ద్వారా డిఎంకెను అడ్డుకోవచ్చనేది వీరి ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.ప్రస్తుతానికి ఇవన్నీ ప్రాథమిక చర్చలు , ఊహాగానాలే. మే 4న వెలువడే అసలు ఫలితాలపైనే అందరి దృష్టి నెలకొంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమై హంగ్ ఏర్పడితే మాత్రం తమిళ రాజకీయం మలుపులు తిరగడం ఖాయం. ఒకవేళ టీవీకే ఊహించిన దానికంటే ఎక్కువ సీట్లు సాధిస్తే విజయ్ సీఎం పదవికి పట్టుబట్టే అవకాశం ఉంది, అదే సమయంలో అన్నాడీఎంకే తన పాత వైభవాన్ని చాటుకుంటే పళనిస్వామి పట్టు సడలించేలా లేరు కౌంటింగ్ తర్వాత వచ్చే నంబర్ గేమ్ ఆధారంగానే తమిళనాడు తదుపరి ముఖ్యమంత్రి ఎవరనేది తేలనుంది.

బెంగాల్ లో మార్పు ఖాయమేనా

కోల్ కత్తా, ఏప్రిల్ 30 : వెస్ట్ బెంగాల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. ఎక్కడ కూడా అధికార టిఎంసి నేతల్లో ఉత్సాహం కనిపించలేదు. కనీసం వారిలో గెలుస్తామని ఆశ కూడా కనిపించలేదు. దీనిని బట్టి అక్కడ బిజెపి హవా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో అధికార టీఎంసీ నాయకులు ప్రతిసారి దూకుడు కొనసాగిస్తుంటారు.. ప్రత్యర్థి పార్టీలకు చుక్కలు చూపిస్తుంటారు. అవసరమైతే హింసకు కూడా వెనుకాడరు. ప్రాణాలను కూడా తీస్తారు. ఎందుకంటే అది మమత రాసిన రాజ్యాంగం.. మమత బెనర్జీ గత 15 సంవత్సరాలుగా వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో రూపొందించిన తన మార్క్ న్యాయం. అవినీతి అక్కడ నిత్య కృత్యం.. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులకు అది సురక్షితమైన షెల్టర్.. మమత బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారికి అద్భుతంగా అండదండలు లభించాయి. చివరికి ఆధార్ కార్డులు.. ఓటరు గుర్తింపు కార్డులు కూడా అందాయి. దీంతో మమత పార్టీ కి దండిగా ఓట్లు పడ్డాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.కేంద్ర ఎన్నికల సంఘం అక్రమంగా నమోదైన ఓటర్లను ఏరి వేసే కార్యక్రమం చేపట్టింది.. దీంతో చాలామంది అక్రమార్కులు తమ ఓటు హక్కును కోల్పోయారు. ఇది ఒక రకంగా మమతకు గట్టి ఎదురు దెబ్బ. అయితే ఈసారి ఎన్నికలను బిజెపి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి సందర్భంలోనూ మమతకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంలో తిరుగులేని స్ట్రాటజీని పాటించింది. ఫలితంగా మమత ఏమీ చేయలేని స్థితిలో కూరుకుపోయింది.మీరు ఆశీర్వదిస్తే ఇలాంటి సభలకు వస్తాను. లేనిపక్షంలో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటానని ఎన్నికల సభలో మమత వ్యాఖ్యానించిందంటే.. అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వెస్ట్ బెంగాల్ లో బిజెపి నాయకత్వం ఈసారి ఏకతాటి మీద పని చేసింది. విభేదాలను పక్కనపెట్టింది. సీట్ల విషయంలో కూడా అత్యంత జాగ్రత్తలు పాటించింది. అధికార టీఎంసీ నేతల ఆగడాలను ఎక్కడికి అక్కడ అడ్డుకుంది. అందువల్లే బిజెపి ఈసారి అక్కడ అధికారంలోకి వచ్చే అవకాశం కనిపిస్తుంది.పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మొత్తంగా 294 స్థానాలు ఉన్నాయి. మెజారిటీ సంస్థలు బిజెపి అధికారంలోకి వస్తుందని ప్రకటించాయి. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరిగిన ఎన్నికల్లో అస్సాం, పుదుచ్చేరి ప్రాంతాలలో ఎన్డీఏ గెలుపు దాదాపుగా ఖాయం. ఇప్పుడు అదనంగా వెస్ట్ బెంగాల్ కూడా బిజెపి ఖాతాలో చేరుతోంది. ఈ ప్రకారం చూసుకుంటే భవిష్యత్ కాలంలో కేరళ, తమిళనాడులో కూడా బిజెపి జెండా ఎగురుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

భారీగా పెరుగుతున్న బిలీయనీర్లు

ముంబై : ప్రపంచంలోనే అధికంగా జనాభా ఉన్న దేశం.. మేధస్సుపరంగా అత్యంత విలువైన యువత ఉన్న దేశం.. వనరులపరంగా.. సాంస్కృతిక వైవిధ్యం పరంగా ప్రపంచానికే పాఠాలు చెప్పే దేశం.. భిన్న వాతావరణాలు.. భిన్న సంస్కృతులు.. భిన్నమైన ప్రజలతో అలరారే దేశం.. ఇంతటి విశేషణం.. విశ్లేషణం కేవలం మన దేశానికి మాత్రమే సొంతం. అందువల్లే ప్రపంచానికి భారత్ ఒక మార్గదర్శి.. దిక్సూచి.

ఇంతటి స్థాయిలో అనుకూలతలు ఉన్నప్పటికీ భారతదేశన్ని ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశమనే అంటుంటారు. దీనికి అనేక రకాల కారణాలు ఉన్నాయి. అవి ఎలా ఉన్నప్పటికీ.. భారత్ గొప్ప దేశం. శాస్త్ర సాంకేతికతలనుంచి మొదలుపెడితే.. వ్యవసాయం వరకు భారత్ ఇప్పటికీ తన విభిన్న తత్వాన్ని నిరూపించుకుంటూనే ఉంటుంది.అవినీతి, ఇతర వ్యవహారాల వల్ల ఇప్పటికి అభివృద్ధి చెందుతున్న దేశం గానే భారత్ ఉండిపోతోంది. అయినప్పటికీ మన దేశంలో శ్రీమంతుల సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా నైట్ ఫ్రాంక్ అనే సంస్థ మనదేశంలో ఉన్న ఆగర్భ శ్రీమంతుల సంఖ్యను లెక్క కట్టింది. 2031 నాటికి మనదేశంలో 313 మంది బిలియనీర్లు ఉంటారని పేర్కొంది.

ఈ జాబితాలో ఒక్కో వ్యక్తి 100 కోట్లకు పైగా ఆస్తులను సంపాదించుకుంటారని ఆ సంస్థ ప్రకటించింది . 2026 లో 207 మంది బిలియనీర్లు మనదేశంలో ఉన్నారు. ఆ సంఖ్యతో పోల్చి చూస్తే 2031 నాటికి 51 శాతం శ్రీమంతులు పెరిగే అవకాశం ఉంది. చైనాలో 20%.. అమెరికాలో 12% శ్రీమంతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆ సంస్థ వెల్లడించింది. ది వెల్త్ రిపోర్టులో ఆ సంస్థ ఈ నివేదికను వెల్లడించింది.ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న వ్యాపారాలు.. ఇతర వ్యవహారాల వల్ల ప్రతిరోజు ప్రపంచంలో 89 మంది అల్ట్రా రిచ్ (30 మిలియన్ డాలర్ల సంపద) గా మారుతున్నట్టు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 3,110 మంది బిలియనీర్లు ఉన్నారు. వచ్చే ఐదేళ్లలో ఈ సంఖ్య 3,915 కి పెరుగుతుందని సమాచారం. "ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకమైన పరిస్థితులు ఉన్నప్పటికీ.. విభిన్నమైన వ్యాపారాలు చేసేవారు తమ సంపదను పెంచుకుంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల అవసరాలు మారిపోతున్న క్రమంలో.. కొంతమంది ప్రత్యేకమైన వ్యాపారాలు చేస్తున్నారు. అందువల్ల వారు తమ సంపాదనను పెంచుకుంటున్నారు. అందువల్లేవారు ఈ స్థాయిలో శ్రీమంతులుగా మారిపోతున్నారని" నైట్ ఫ్రాంక్ సంస్థ ది వెల్త్ రిపోర్టులో పేర్కొంది.

అమెరికాలో ఏం జరుగుతోంది?

కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్...

హైదరాబాద్ : అమెరికాను సుసంపన్నం చేసిందే హెచ్1బీ వీసా.. ఎందుకంటే ఈ వీసా ఆధారంగా చేసుకుని ప్రపంచం నలుమూలల నుంచి ప్రతిభావంతులు అమెరికా గడ్డపై అడుగుపెట్టి.. అక్కడే తమ భవిష్యత్తును నిర్మించుకున్నారు. అంతేకాదు.. దాంతో పాటు అమెరికా ఆర్థికవ్యవస్థను సైతం సుసంపన్నం చేశారు. అందుకే వారిని అమెరికా సైతం అంతేస్థాయిలో గౌరవించింది కూడా. కానీ ఎప్పుడైతే ట్రంప్ అధికారంలోకి వచ్చారో.. అప్పటి నుంచి వారిని వేరు చేసి మాట్లాడడం మొదలు పెట్టారు. వారిని దొంగలుగా, దోపిడీ దారులుగా చిత్రీకరించడం పెరిగిపోయింది.సాక్షాత్తూ అధ్యక్షుడే .. ఎన్నారైలు ఇక్కడకు వచ్చి, తమ అవకాశాలను దోచేస్తున్నారని పదేపదే ప్రకటిస్తుండడంతో.. ఇక ప్రజలు ఊరుకుంటారా..? దీంతో ఇప్పుడు అమెరికాలో తమ కలల సౌధాన్ని నిర్మించుకున్న సగటు ఎన్నారై.. తాము దశాబ్దాల క్రితం చేసింది తప్పా అని అంతర్మథనంలో పడిపోయాడు. ఎందుకంటే అక్కడే ఆస్తులు కొన్నారు. అక్కడే ఉద్యోగాలు చేస్తున్నారు.. అక్కడే పిల్లలు పుట్టి పెరిగి పెద్దవాళ్లై అమెరికా సిటిజన్లుగా మారిపోయారు. ఇప్పుడు వారందరికి మీరు ఇక్కడి వాళ్లు కాదు.. వెళ్లిపోండని అల్టిమేటమిస్తే.. ఎలా ఉంటుంది. మనస్సు చివుక్కు మనదూ..దీంతో ఇప్పుడు అమెరికాలో స్థిరపడిన ఎన్నారైల్లో 40 శాతం మంది తిరిగి వెళ్లిపోతే బాగుంటుందా అన్న ఆలోచనలో పడ్డారు. ఇది సాధారణ విషయం కాదు.. ఎందుకంటే.. ఓ స్థాయికి వెళ్లిన వ్యక్తి? దేశంకోసం జీవితాంతం కష్టపడిన కుటుంబాలు తిరిగి వెళ్లిపోదామని భావించాయంటే.. అది వారిని ఎంతగా మానసికంగా , శారీరకంగా ఇబ్బంది పెట్టాయో అర్థమవుతుంది. వీరు వెళ్లిన తర్వాత మళ్లీ ప్రతిభావంతులను రమ్మని అమెరికా ఆహ్వానించగలదా.. ఆహ్వానించినా వీటన్నింటిని చూసిన యువత.. మళ్లీ అటువైపు చూస్తుందా.. అంటే అమెరికా.. ఇక అమెరికన్లకే పరిమితం కానుంది.దీనర్థం ఇక అమెరికా ప్రతిభావంతులకు ఆహ్వానం పలికే పరిస్థితి ఉండదు.. కేవలం వారు అమెరికన్లు అయితే చాలు అన్న సంకుచిత స్వభావాన్ని వంట పట్టించుకుంటోంది. దీంతో ఇక అక్కడ నూతన ఆవిష్కరణలు తగ్గిపోతాయి. కొత్త కంపెనీల రాక, పెట్టుబడులు నిలిచిపోతాయి. సాధారణ సగటు దేశంగా అమెరికా మారనుందన్న అంశం దీంతో అర్థమవుతోంది.ఓవైపు ఇరాన్ యుద్ధంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ .. తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ముఖ్యంగా? ఆయుధాలకే లక్షల డాలర్లు ఖర్చుపెడుతోంది. వీటన్నింటికీ ఎవరి దగ్గర వసూలు చేస్తుంది. మళ్లీ సగటు అమెరికన్ దగ్గరే. ఓవైపు ఖర్చులు పెరుగుతున్నాయి. మరోవైపు..ఆర్థికాన్ని పరుగు పెట్టించే ప్రతిభావంతులు దేశం దాటిపోనున్నారు. ఇక అమెరికాకు మంచి రోజులు అన్నవి గతమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఖజానా నింపేదెలా?

హైదరాబాద్ : తెలంగాణ ఖజానాను నింపే మార్గాలను అన్వేషించేందుకు ఏర్పాటైన 'రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్' సబ్‌కమిటీ పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఫైళ్లు కదలడం, సమావేశాలు జరగడం వల్ల రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని, క్షేత్రస్థాయిలో ఆదాయం పెరిగినప్పుడే ఆ కమిటీ ఉనికికి సార్థకత ఉంటుందని ఆయన కుండబద్దలు కొట్టారు. అధికారుల తీరుపై సీఎం అసహనం వ్యక్తం చేస్తూ, పరిపాలనలో వేగం పెంచాలని హెచ్చరించారు.ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఆర్థిక వనరుల సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం, ఇందుకోసం మంత్రుల నేతృత్వంలో సబ్‌కమిటీని ఏర్పాటు చేశారు. అయితే, ఈ కమిటీ పలుమార్లు భేటీ అయినప్పటికీ, ఆదాయాన్ని పెంచే దిశగా ఇప్పటివరకు ఎలాంటి విప్లవాత్మకమైన లేదా స్పష్టమైన ప్రతిపాదనలు ముందుకు రాలేదు. దీనిపై సీఎం మండిపడ్డారు. సమావేశాలు నిర్వహించడం ముఖ్యం కాదని, ఆ సమావేశాల ద్వారా ఖజానాకు ఎంత ఆదాయం సమకూరిందో లెక్కలు చూపాలని అధికారులను నిలదీశారు. కేవలం అంకెలు, అంచనాలకే పరిమితం కాకుండా, ఆదాయ మార్గాలను అన్వేషించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అత్యంత కీలక దశలో ఉంది. ఒకవైపు సంక్షేమ పథకాల అమలు, మరోవైపు ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్ల చెల్లింపులు ప్రభుత్వానికి పెను సవాలుగా మారాయి. ఖర్చులు గణనీయంగా పెరుగుతున్న తరుణంలో, అందుకు తగ్గట్టుగా ఆదాయ వనరులు పెరగకపోవడం పట్ల సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోతే, సంక్షేమ పథకాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఖజానా గండం గట్టెక్కాలంటే సంప్రదాయేతర మార్గాల్లో కూడా ఆదాయాన్ని రాబట్టాలని సూచించారు.ఈ జాప్యాన్ని ఇక ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 100 రోజుల్లో తక్షణమే అమలు చేయగలిగే, ఫలితాలను ఇచ్చే ఆదాయ పెంపు మార్గాలపై స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. మే 4వ తేదీ నాటికి పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేశారు. అదే రోజు మళ్లీ కేబినెట్ సమావేశం నిర్వహించి, కమిటీ ఇచ్చే నివేదికపై చర్చించి తదుపరి కఠిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు.తెలంగాణను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న పట్టుదలతో ఉన్న ముఖ్యమంత్రి, అధికారుల అలసత్వాన్ని ఏమాత్రం ప్రోత్సహించడం లేదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఆదాయం పెంచే విషయంలో 'వంద రోజుల లక్ష్యం' ఇప్పుడు అధికారుల ముందున్న పెద్ద సవాలు. మే 4న జరగబోయే కేబినెట్ భేటీలో ఎలాంటి విప్లవాత్మక నిర్ణయాలు వెలువడతాయో, రాష్ట్ర ఆర్థిక గమనం ఏ మలుపు తిరుగుతుందో చూడాలి. కేవలం మాటలు కాకుండా, అంకెల్లో ప్రగతిని చూడాలని కోరుకుంటున్న రేవంత్ రెడ్డి సర్కార్, రెవెన్యూ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించే పనిలో నిమగ్నమైంది.

వర్క్ ఫ్రమ్ హోమ్ కు డిమాండ్

హైదరాబాద్ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాలతో పాటు భారత్‌లోనూ చమురు, గ్యాస్ సరఫరాలో కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చమురు కంపెనీలు పెట్రోల్ బంకులకు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్ నిబంధనలు మార్చడంతో చాలా రాష్ట్రాల్లో ఇబ్బందులు మొదలయ్యాయి. ఏపీతోపాటు తెలంగాణ రాజధాని హైదరాబాద్ లోనూ పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా వేదిస్తోంది. బంకుల వద్ద వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం గంటల తరబడి బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్ర మవుతున్న నేపథ్యంలో వర్క్ ఫ్రమ్ హోం డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.గతంలో కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించింది. ఈ సమయంలో ఉద్యోగులకు కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చాయి. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత నేపథ్యంలో రవాణా వ్యవస్థ స్తంభించి పోతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వర్క్ ఫ్రమ్ హోం ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది.పెట్రోల్, డీజిల్ కొరతతో పాటు ఎండలు కూడా మండిపోతున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9గంటల తరువాత బయటకు వచ్చేందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోంను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు కోరుతున్నారు. పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రమైతే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించేందుకు కేంద్రం మొగ్గుచూపే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే, లాక్ డౌన్ కంటే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు. వర్క్ ఫ్రమ్ హోం విధానం వల్ల పెట్రోల్, డీజిల్ కొరతతో ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి బయటపడంతోపాటు ఎండల నుంచి రక్షణ పొందొచ్చని, మరోవైపు ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టొచ్చని, పొల్యూషన్ తగ్గుతుందని పలువురు నెటిజన్లు సూచిస్తున్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

రేణుక ఏడాదిన్నరలో ముగ్గురిని మార్చింది

హైదరాబాద్ : నా భార్య రేణుకకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ.. ఆమె ఏడాదిన్నరలోనే ముగ్గురితో వివాహేతర సంబంధం పెట్టుకుంది.. అంతేకాకుండా.. ప్రైవేట్ వీడియోలను రికార్డు చేసుకోగా.. ఓ లవర్ దానిని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఆ దారుణాలను చూసి నేను ఎలా తట్టుకోగలగాలి.. అసలు రేణుకకు ఏం కావాలి.. ప్రేమ నా లేక శృంగారమా..? '' అంటూ ఓ భర్త.. ఏకంగా 19 పేజీల సూసైడ్ నోట్ రాసి.. ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య అరాచకాలకు మరో భర్త బలైపోయిన సంఘటన హైదరాబాద్ నగరంలో సంచలనంగా మారింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీతారాం ఆ లేఖలో ప్రస్తావించిన విషయాలు సంచలనంగా మారాయి.. ఏ అమ్మాయి కూడా అలా చేయవద్దంటూ సీతారాం తన వేదనను లేఖ రూపంలో పంచుకున్నాడు. ఏపీలోని మార్కాపురానికి చెందిన సీతారాం, నంద్యాలకు చెందిన రేణుకకు 2018లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాచుపల్లిలో నివాసం ఉండేవారు.. ఈ క్రమంలోనే.. భార్య వివాహేతర సంబంధాలు బయటపడటం, ఇన్‌స్టాలో వీడియోలు బయటపడటంతో ఫిబ్రవరిలో ట్యాంక్‌బండ్ లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.అయితే.. సీతారాం తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా సంచలన విషయాలు వెలుగుచూశాయి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీతారాం రాసిన 19 పేజీల సూసైడ్ లేఖను స్వాధీనం చేసుకున్నారు.తన భార్య వివాహేతర సంబంధాలే తన చావుకు కారణం అంటూ సీతారాం లేఖలో ప్రస్తావించాడు.. 19 పేజీల్లో రేణుక వివాహేతర సంబంధాలపై పూర్తి విషయాలు రాశాడు.. రేణుక ముగ్గురితో వివాహేతర సంబంధం పెట్టుకుందని.. ఏడాదిన్నరలోనే ముగ్గురితో వివాహేతర సంబంధం నడిపిందని తెలిపాడు. ఒకరితో ప్రైవేట్‌గా ఉన్న సమయంలో ఆ వీడియోలను రికార్డ్ చేసిందని తెలిపాడు.."ఒక అమ్మాయి ప్రైవేట్ వీడియోలను రికార్డ్ చేయడం ఏంటి? రమణ అనే వ్యక్తి ఆ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.. అవి చూసి నేను ఎలా తట్టుకోవాలి? అవి చూశాకే తెలిసింది నా భార్య నిజస్వరూపం.. నా భార్యకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె నాకు నమ్మక ద్రోహం చేసింది".. అంటూ సూసైడ్ లెటర్‌లో సీతారాం ఆవేదన వ్యక్తంచేశాడు.. తాను ఇంట్లో లేని సమయంలో రమణ పలుమార్లు ఇంటికి వచ్చి రేణుకతో గడిపాడని.. అసలు రేణుకకు ఏం కావాలి.. అంటూ ఆ లేఖలో ప్రశ్నించాడు సీతారాం..కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీతారాం రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ సూసైడ్ కేసులో ఇప్పటికే ముగ్గురు అరెస్టయ్యారు. రేణుకతో పాటు ఆమె ఇద్దరు లవర్స్ రమణారెడ్డి, శ్రవణ్ అరెస్ట్ అయినట్లు పోలీసులు తెలిపారు.

జన విజయం
JANA VIJAYAM
3-9 మే, 2026
3-9 May, 2026

ఆప్...సోపాలు

ఒకప్పుడు ఆమ్‌ఆద్మీ పార్టీ పేరు వింటే చాలు, సగటు మనిషి ఛాతీ గర్వంతో మరో రెండు అంగుళాలు విశాలమయ్యేది. అవినీతిని అంతమొందించడంలో, ప్రజారంజకమైన పాలన అందించడంలో ఆ పార్టీ ముందుంటుందన్న ధైర్యం వారిలో అడుగడుగునా కనబడేది. కానీ, పద్నాలుగేళ్లు తిరిగేసరికి ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అవినీతి కూపంలో నిండా మునిగిపోయి, ఊపిరాడక సతమతమవుతున్న ఆ పార్టీ సగటు మనిషికి ఏనాడో దూరమైంది. ఈ పరిస్థితికి కొంతవరకూ ఆ పార్టీ అధినేత కారణం కాగా, మరికొంత కేంద్రంలో చక్రం తిప్పుతున్న ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా కారణం. ఈ మిత్రద్వయం తరచూ వేస్తున్న ఎత్తుగడలకు చిత్తవడం కేజ్రీ వంతవుతోంది. మద్యం కుంభకోణం కేసులు బనాయించి, ముఖ్యమంత్రినే అరెస్ట్ చేయించి, ఆ కేసుల ఆధారంగా పార్టీ పెద్దలపై అవినీతి ముద్ర వేసి, ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకున్న ఈ కమలనాథులు అంతటితో ఆగలేదు. రాజ్యసభ సభ్యులైన ఏడుగురు ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలను తమవైపు తిప్పుకుని, బిజెపిలో విలీనం చేసుకోవడం తాజా పరిణామం. ఢిల్లీ మద్యం కేసులో సిబిఐ కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో రాబోయే పంజాబ్ ఎన్నికల్లో గెలుపు తమదేనని సంతోషిస్తున్న కేజ్రీవాల్‌కు ఆ సంబరం మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. నిన్నటివరకూ తనకు, పార్టీకి కుడిభుజంలా నిలబడినవారు సైతం అకస్మాత్తుగా ఇలా 'ఫిరాయించడం'తో కేజ్రీ దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆమ్‌ఆద్మీ పార్టీ పెట్టకముందునుంచీ కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితులుగా మెలగిన రాఘవ్ చద్దా, స్వాతి మలీవాల్ వంటివారు సైతం బిజెపి గూటికి చేరిపోవడం వింతల్లోకెల్లా వింత. రాజ్యసభలో తమ బలాన్ని పెంచుకోవడం, రాబోయే పంజాబ్ ఎన్నికల్లో పాగా వేయడం లక్ష్యంగా మోడీ, షా ద్వయం తాజా వ్యూహానికి తెర తీశారన్నది విస్పష్టం. ఆప్ ఎంపిల చేరికతో రాజ్యసభలో బిజెపి సభ్యుల బలం 113కి చేరగా, ఎన్‌డిఎ బలం 146కు పెరిగింది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) లో లొసుగులను ఆసరా చేసుకుని ఇలా ఇతర పార్టీల సభ్యులకు ఎర వేసినందుకు మోడీ, అమిత్ షాలను తప్పుబట్టడంలో తప్పేమీ లేదు. అయితే, ఒక రాజకీయ పార్టీ అధినేతగా ఉంటూ, పదేళ్లపాటు ఢిల్లీని పాలించి చాలినంత రాజకీయ, పాలనా అనుభవం గడించి కూడా.. ప్రత్యర్థుల ఎత్తుగడలను చివరిదాకా పసిగట్టలేకపోయినందుకు కేజ్రీవాల్‌నూ అంతే తప్పుపట్టాలి. ప్రాంతీయ పార్టీల పొడ అసలే గిట్టని భారతీయ జనతా పార్టీ పెద్దలు, వాటి ఊపిరి తీసేందుకు ఎంతకైనా తెగిస్తారనేది గత చరిత్రను తిరగేస్తే తెలుస్తుంది. దేశ రాజధానిలో తిష్ఠవేసుకుని కూర్చుని, తమకు పక్కలో బల్లెంలా మారిన ఆప్‌ను అంతమొందించాలన్నది మోడీ, అమిత్ షాల చిరకాల వాంఛ. అందులో చాలావరకూ కృతకృత్యులయ్యారన్నది ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడంతోనే రుజువైంది. ఇక పంజాబ్ లోనూ ఆప్‌ను అధికారంనుంచి దింపడమే లక్ష్యంగా కేజ్రీవాల్ ఆరోపించినట్లు 'ఆపరేషన్ లోటస్'కు తెరతీశారు. మునుపటి ఎన్నికల్లో పంజాబ్‌లో ఆప్ విజ యం వెనుక కీలకపాత్ర పోషించిన రాఘవ్ చద్దాకు గాలం వేయడం అందులో భాగమే. అగ్నికి ఆజ్యం తోడైనట్లు, బిజెపి నేతల ఎత్తుగడలకు కేజ్రీవాల్ స్వయంకృతాపరాధాలు తోడయ్యాయి. అవినీతిని అంతం చేస్తానని నమ్మబలికిన ఆప్ అదే అవినీతికి ఆలవాలమైందన్న బిజెపి పెద్దల ఆరోపణలకు కేజ్రీవాల్ ఇంద్రభవనాన్ని తలదన్నుతూ కట్టుకున్న ఇల్లు, మద్యం కుంభకోణం వంటివి బలం చేకూర్చాయి. ఇప్పటికైనా మించింది లేదు. తమ పార్టీ నేతలు మరికొందరు చేజారకముందే ఆప్ అధినేత జాగ్రత్తపడటం మంచిది. వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే పంజాబ్ ఎన్నికల్లో బిజెపి ఎత్తుగడలను తిప్పికొట్టేలా పదునైన వ్యూహాలను రచించగలగాలి. కొన్నేళ్లుగా పంజాబ్ లో పలువురు ఆప్ నాయకులను బిజెపి నయానో భయానో తవ-ంవైపు తిప్పుకోగలిగింది. ఈ తెలివిడి, రాజకీయ చతురత లేకనే ఆప్ అగ్రనేతలు ప్రత్యర్థులు పన్నిన ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం భారత రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చద్దా బీజేపీలో చేరిక. ఆప్ కీలక నేతగా పేరున్న రాఘవ్, అనూహ్యంగా కాషాయ పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆయన ఈ నిర్ణయం వెనుక కారణాలపై పలు ఊహాగానాలు చెలరేగుతుండగా, మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ సిద్ధూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. రాఘవ్ చద్దా బీజేపీలో చేరడానికి గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రానే ప్రధాన కారణమని ఆమె పేర్కొన్నారు. "రాఘవ్ చద్దా తన సోదరి పరిణీతి చోప్రా భర్త కావడంతో ఆయనను కాపాడుకోవడానికి ప్రియాంక ఈ నిర్ణయం తీసుకున్నారు" అని కౌర్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు రాఘవ్ వెనుక పడ్డారని, త్వరలోనే ఆయనపై ఈడీ దాడులు జరిగే అవకాశం ఉందని ప్రియాంకకు ముందే సమాచారం అందిందని ఆమె వెల్లడించారు. అందుకే తన చెల్లెలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాఘవ్‌ను బీజేపీ వైపు మళ్లించారని కౌర్ పేర్కొన్నారు. అంతేకాకుండా, రాఘవ్ చద్దాకు ఆప్ అధిష్టానానికి మధ్య చాలా కాలంగా విభేదాలు ఉన్నాయని నవజ్యోత్ కౌర్ సిద్ధూ వివరించారు. పార్టీ కోసం రాఘవ్ సరిగా మాట్లాడటం లేదని ఆప్ నాయకత్వం భావించిందని, ఆ కారణంగానే వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయని ఆమె తెలిపారు. ఏదైనా తప్పు జరిగినప్పుడు అప్పుడే గళం విప్పాలని, నాలుగేళ్ల తర్వాత మాట్లాడటం సరికాదని ఆమె అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రాజకీయ మార్పు రాఘవ్ చద్దా సోషల్ మీడియా ఇమేజ్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. బీజేపీలో చేరిన మ-రుసటి రోజే ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో 20 లక్షలకు పైగా (రెండు మిలియన్లు) ఫాలోవర్లను కోల్పోయారు. ఆప్ తన వ్యవస్థాపక సూత్రాలు, సిద్ధాంతాల నుంచి దూరంగా వెళ్లడంతో తాము బీజేపీలో విలీనమయ్యామని మీడియా సమావేశంలో చద్దా వెల్లడించారు. ఆప్ కోసం 15 ఏళ్లు నా రక్తం, చెమట ధారపోశాను.. సూత్రాలు, విలువలు, మౌలిక నైతికత నుంచి పార్టీ పూర్తిగా పక్కకు తప్పుకుంది" అని ఆయన అన్నారు. "రాజ్యాంగం ప్రకారం ఒక పార్టీకి చెందిన మొత్తం ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది మరో పార్టీలో విలీనం కావచ్చు" అని తమ పార్టీలోని 10 మంది ఎంపీల బలాన్ని ప్రస్తావిస్తూ చద్దా తెలిపారు. "వారు ఇప్పటికే సంతకాలు చేశారు.. ఈ ఉదయం మేము సంతకాలు చేసిన లేఖలు, ఇతర పత్రాలతో సహా అవసరమైన అన్నింటిని రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించడం... విలీనానికి అనుమతించడం చకచకా జరిగిపోయాయి. అవినీతికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో పుట్టిన ఆప్.. 14 ఏళ్ల తర్వాత పార్టీ చరిత్రలోనే అత్యంత కఠినమైన సవాళ్లలో ఒకదాన్ని ఎదుర్కొంటోంది. సినీ ప్రముఖులు కునికా సదానంద్, ప్రకాష్ రాజ్ వంటి వారు కూడా రాఘవ్ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం నవజ్యోత్ కౌర్ సిద్ధూ చేసిన ఈ కీలక వ్యాఖ్యలపై ఇప్పటివరకు ప్రియాంక చోప్రా, పరిణీతి చోప్రా లేదా రాఘవ్ చద్దా నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అయితే, ఈ నిర్ణయం వెనుక నిజంగా ఇదే కథ ఉందా అనే ప్రశ్న ప్రజల్లో మొదలైంది. రాఘవ్ చద్దా రాకతో బీజేపీ బలం పెరుగుతుందా లేదా ఆమ్ ఆద్మీ పార్టీ దెబ్బతింటుందా అనేది వేచి చూడాలి. ఒకవైపు పార్టీ క్యాడర్‌ను కాపాడుకుంటూ, మరోవైపు ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తుచేసేలా రాజకీయ వ్యూహరచన చేయగలిగితేనే పంజాబ్‌లో ఆప్ అధికారాన్ని నిలుపుకునేది. మద్యం కుంభకోణ కేసులో సిబిఐ కోర్టు ఇచ్చిన తీర్పును, తాజాగా తమ పార్టీ ఎంపిల విలీనం ఉదంతాన్ని ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకువెళ్లగలగాలి. లేదంటే జాతీయ పార్టీగా గుర్తింపు తెచ్చుకున్న ఆమ్‌ఆద్మీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేకుండా పోయే పరిస్థితి దాపురిస్తుంది.

తీరనున్న కనిగిరి ప్రాంత వాసుల కల

ఒంగోలు: పశ్చిమ ప్రకాశం, మార్కాపురం జిల్లావాసులు.. ముఖ్యంగా కనిగిరి ప్రాంత ప్రజల కలనెరవేరనుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైలు సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుంది. గుంటూరు నుంచి కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు రైల్వే అధికారులకు ప్రతిపాదనలు పంపారు. వారంలో ఆరు రోజుల పాటూ రైలును నడిపేలా ప్రతిపాదించారు.

రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని.. త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుందని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రం సహకారంతో రైల్వే ప్రాజెక్టుల పనులు వేగవంతం అవుతున్నాయి. పాత ప్రాజెక్టులతో పాటుగా కొత్త ప్రాజెక్టులు కూడా ఒక్కొక్కటిగా పట్టాలెక్కుతున్నాయి. రాష్ట్రంలో కీలకమైన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు వేగవంతం చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లా, ప్రస్తుతం మార్కాపురం జిల్లా కనిగిరి వరకు పనులు పూర్తి చేశారు. (

ప్రస్తుతం పామూరు వైపుగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కనిగిరి వరకు రైల్వే లైన్ పనులు పూర్తికావడంతో అక్కడి వరకు రైళ్లు నడపాలని ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులతో పాటుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. రైల్వేశాఖకు విన్నవించారు. కనిగిరివాసుల ఎన్నో ఏళ్ల కలను నిజం చేసే దిశగా ఓ ముందడుగు పడింది. నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి.

గుంటూరు నుంచి గుండ్లకమ్మ మీదుగా కనిగిరి వరకు ఈ రైలును నడిపేందుకు గుంటూరు రైల్వే డివిజన్ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఈ నెల 24న ఆ వివరాలు అధికారుల దగ్గరకు చేరాయి. తాజా ప్రతిపాదనల ప్రకారం వారంలో ఆరు రోజుల పాటూ గుంటూరు నుంచి కనిగిరి వరకు ఈ కొత్త సర్వీస్‌ను నడపాలని ప్రతిపాదించారు. ఈ ప్యాసింజర్ రైలు గుంటూరులో ఉదయం 8.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1 గంటకు కనిగిరి చేరుకునేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2 గంటలకు కనిగిరి నుంచి బయల్దేరి రాత్రి 7 గంటలకు గుంటూరు చేరుకునేలా ప్లాన్ చేశారు. అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే పూర్తి షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు. నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు రైలును నడపాలని గతంలోనే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రైల్వే అధికారులకు విన్నవించారు. ఇటీవల రైల్వే అధికారుతో మాట్లాడటంతో సానుకూలంగా స్పందించారు. కనిగిరి రైల్వే స్టేషన్ పనులు పూర్తికావడం, ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందబాటులోకి రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేవు అంటున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా పూర్తి చేయడంతో.. కొత్తగా ప్యాసింజర్ రైలును కనిగిరి వరకు నడిపేందుకు దాదాపుగా లైన్ క్లియర్ అయినట్లేనని చెబుతున్నారు. కనిగిరి నుంచి ప్యాసింజర్ రైలు ప్రారంభమైతే ఆ ప్రాంతం నుంచి రాజధాని ప్రాంతమైన గుంటూరుకు కనెక్టివిటీ కూడా పెరుగుతుందంటున్నారు. కనిగిరి మాత్రమే కాదు పొదిలి, దర్శి ప్రాంతాల ప్రజలకు కూడా ఎంతో సౌకర్యంగా ఉంటుంది. మొత్తం మీద మార్కాపురం, పశ్చిమ ప్రకాశం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది.

కేటీఆర్ వర్సెస్ కవిత

హైదరాబాద్ : కల్వకుంట్ల కుటుంబంలో వారసత్వ పోరు ఇప్పుడు కీలకదశకు చేరు?ంది. కేసీఆర్ వారసులలో ఎవరు సమర్థులు కేటీఆర్ నా..కవితనా ?. కేటీఆర్.. మగపిల్లాడే వారసుడు అనే అడ్వాంటేజ్ తీసుకుని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిపోయారు. ఆయన నాయకత్వాన్ని మొదట కవిత కూడా అంగీకరించారు. కానీ తనకు అసలు రాజకీయ భవిష్యత్తే లేకుండా చేయాలనుకోవడంతో కవిత తన దారి తాను చూసుకున్నారు. ఆమె సొంత రాజకీయాలు ప్రారంభించడంతో నిజంగా ఇద్దరిలో ఎవరు రాజకీయంగా సమ-ర్థులు అనే ప్రశ్న వస్తోంది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని గాడిలో పెట్టడంలో కేటీఆర్ ఆశించిన స్థాయిలో సఫలం కాలేదనే అభిప్రాయం బలంగా ఉంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, పార్టీ నుంచి కీలక నేతల వలసలు ఆయన నాయకత్వ వైఫల్యానికి అద్దం పడుతున్నాయి. కేసీఆర్ మళ్లీ క్రియాశీలక బాధ్యతలు తీసుకోవాలని .. పార్టీని గాడిలో పెట్టాలని కేడర్ కోరుకోవడమే కేటీఆర్ వైఫల్యానికి నిదర్శనమని చెబుతున్నారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఢీకొట్టే విషయంలో పెద్దగా ఆకట్టుకోలేకపోవడం?ప్రజా సమస్యలపై కంటే కేవలం సోషల్ మీడియా విమర్శలకే పరిమితం కావడం ఆయన రాజకీయ పరిణతిని ప్రశ్నించేలా చేశాయి. కవిత తన రాజకీయ అస్తిత్వం కోసం అత్యంత తెలివైన పావులను కదిపారు. బీఆర్ఎస్ వదులుకున్న తెలంగాణ, టీఆర్ఎస్ సెంటిమెంట్‌ను ఆమె మళ్లీ అందిపుచ్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావ సభకు తరలివచ్చిన జనసందోహం, ఆమె మాటల్లోని స్పష్టత రాజకీయ వర్గాలను మెప్పించాయి. తండ్రి, సోదరుడిపై నేరుగా విమర్శలు చేస్తూనే, బీఆర్ఎస్ తన ఆత్మను కోల్పోయిందని, తాను మళ్లీ సామాజిక తెలంగాణ ఆశయాలను మోస్తానని చెప్పడం ద్వారా ఆమె బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై గట్టిగా గురిపెట్టారు. ఇప్పటివరకు జరిగిన పరిణామాలను బట్టి చూస్తే, రాజకీయ ఎత్తుగడల్లో కేటీఆర్ కంటే కవితే కాస్త ముందున్నట్లు కనిపిస్తోంది. కేటీఆర్ కేవలం పార్టీ పదవిని వారసత్వంగా స్వీకరిస్తే, కవిత మాత్రం ప్రతికూల పరిస్థితుల్లో కూడా తనదైన శైలిలో పబ్లిసిటీని, జనసమీకరణను నిర్వహించి ఇంపాక్ట్ సృష్టించగలిగారు. బీఆర్ఎస్‌ను డూప్లికేట్ అని పిలిచే స్థాయికి ఆమె తన కొత్త పార్టీని తీసుకెళ్లడం ఆమె రాజకీయ చతురతకు నిదర్శనం. నియోజకవర్గ స్థాయి నేతలను ఆకర్షించడంలో, ముఖ్యంగా బీఆర్ఎస్‌లో వివక్షకు గురైన వారిని చేరదీయడంలో ఆమె వేగం పెంచారు. కవిత సృష్టించిన ఈ ఇంపాక్ట్ బీఆర్ఎస్‌కు పెనుగండంగా మారే అవకాశం ఉంది. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చీలితే అది పరోక్షంగా అధికార కాంగ్రెస్ లేదా బిజెపికి లాభం చేకూరు-స్తుందా? లేక కవిత నిజంగానే మూడవ ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందా? అన్నది ఉత్కంఠ రేపుతోంది. కేటీఆర్ ఇప్పటికైనా తన శైలిని మార్చుకుని పార్టీని కాపాడుకుంటారా, లేక కవిత సృష్టించిన ఈ సునామీలో బీఆర్ఎస్ తన ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోతుందా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

కేసీఆర్ రీ లోడింగ్

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మరోసారి విద్యార్థి శంఖారావం వినిపించాలని గులాబీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. ఉద్యమ కాలంలో కేసీఆర్ పిలుపుతో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు ఎలాగైతే కదిలాయో.. అదే తరహా ఇంటెన్సిటీని ప్రస్తుత రాజకీయ పోరాటాల్లోకి తీసుకురావడమే లక్ష్యంగా బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రత్యక్షంగా రంగంలోకి రాకముందే విద్యార్థి లోకం రహదారులపైకి వచ్చింది. విద్యార్థుల పోరాటమే ఆనాడు రాజకీయ పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇప్పుడు అదే వ్యూహాన్ని కేసీఆర్ మళ్ళీ నమ్ముకున్నారు.

ప్రతి కాలేజీలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగ కమిటీలను బలోపేతం చేయాలని, యువతను ఫుల్ టైమ్ పొలిటికల్ వారియర్స్ 'గా మార్చాలని ఆయన ఆదేశించడం వెనుక ఒక బలమైన కారణం ఉంది. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ యంత్రాంగం కొంత స్తబ్దుగా మారినా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయాలంటే విద్యార్థుల తెగువ అవసరమని ఆయన గుర్తించారు. అయితే, ఉద్యమ కాలం నాటి సెంటిమెంట్ వేరు, ఇప్పటి రాజకీయ అవసరాలు వేరు. ఆనాడు ప్రత్యేక రాష్ట్రం అనే ఏకైక లక్ష్యం విద్యార్థులను భావోద్వేగంతో ఏకం చేసింది. కానీ నేడు ఉపాధి కల్పన, ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ వంటి అంశాలే విద్యార్థి రాజకీయాలను శాసిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ వంటి వారి నేతృత్వంలో అసెంబ్లీ ముట్టడి, ఫీజుల బకాయిలపై నిరసనలు చేపడుతూ యాక్టివ్ అవుతున్నారు.

కానీ, రాజకీయ ప్రయోజనాల కోసం చేసే పోరాటాలకు విద్యార్థులు ఏ మేరకు స్వచ్ఛందంగా కదులుతారనేది ప్రశ్నార్థకమే. కేసీఆర్ కేవలం నిరసనలకే పరిమితం కాకుండా, యువతకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు. కాలేజీ స్థాయిలోనే నాయకత్వ లక్షణాలు పెంచి, వారిని భవిష్యత్ ఎన్నికల ముఖచిత్రంగా చూపడం ద్వారా కొత్త రక్తాన్ని పార్టీలోకి ఎక్కించాలనుకుంటున్నారు.

ప్రభుత్వంపై పోరాడే క్రమంలో విద్యార్థులు ఎదుర్కొనే కేసులను, సమస్యలను పార్టీ అండగా నిలబడి చూసుకుంటుందని భరోసా ఇవ్వడం ద్వారా వారిని యాక్టివ్ మోడ్ లోకి తీసుకురావాలని చూస్తున్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విద్యార్థుల్లో ఉన్న చిన్నపాటి అసంతృప్తిని కూడా వదులుకోకూడదని బీఆర్ఎస్ భావిస్తోంది. ప్రత్యేకించి విద్యా రంగానికి కేటాయింపులు, నిరుద్యోగ భృతి వంటి హామీలపై ఉన్న వ్యతిరేకతను విద్యార్థి కమిటీల ద్వారా క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం కేసీఆర్ మాస్టర్ ప్లాన్. విద్యార్థులు రోడ్డెక్కితే అది సృష్టించే ఇంపాక్ట్ మీడియాలోనూ, ప్రజల్లోనూ బలంగా ఉంటుంది. ఇది రాజకీయంగా బీఆర్ఎస్‌కు మళ్లీ పూర్వవైభవం తీసుకువస్తుందని ఆశిస్తున్నారు.

విద్యార్థులను రాజకీయాల కోసం రోడ్లపైకి తీసుకురావడం కేసీఆర్ లాంటి చతురత కలిగిన నేతకు పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. కానీ, కేవలం ప్రభుత్వంపై విమర్శలకే పరిమితం కాకుండా, విద్యార్థుల కెరీర్‌కు బీఆర్ఎస్ ఏ రకమైన భరోసా ఇస్తుందనే స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది. రాజకీయ సమీకరణలు మారుతున్న తరుణంలో, ఈ విద్యార్థి కమిటీలు బీఆర్ఎస్‌కు ఏ మేరకు బూస్టర్ డోస్ గా మారుతాయో చూడాలి. ఏది ఏమైనా, కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సెగ పుట్టించడం ఖాయం అనుకోవచ్చు.

బ్యాలెట్ బాక్సుల్లో భవితవ్యం

ప్రజాస్వామ్య భారత్‌లో ఎన్నికలు అంటే కేవలం ఓట్లు వేయడం మాత్రమే కాదు. ఆ ఓటు ఫలితం ఏంటో తెలుసుకోవాలని ఉత్సుకత ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే ప్రజల నాడిని పట్టుకోవాలని ప్రయత్నించే చర్య సర్వేలు. ప్రస్తుతం 2026లో ఐదు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ కూడా వచ్చాయి. అయితే ఈ సర్వేలు ఎలా చేస్తారు. వీటికి ఉండే చట్టబద్ధత ఏంటీ అనే విషయాలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒపీనియర్ పోల్ లేదా అభిప్రాయ సేకరణ అనేది ఎన్నికలు ప్రారంభంకావడానికి ముందే నిర్వహించే సర్వే. నామినేషన్ల ప్రక్రియకు ముందు లేదా ప్రచారం జరుగుతున్న సమయంలో వీటిని చేపడతారు. ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు, వారి ప్రధాన సమస్యలు ఏంటీ, ప్రచార పద్ధతులు ఓటర్లను ఎంత వరకు ప్రభావితం చేస్తున్నాయి అనేది తెలుసుకోవడానికి సర్వేలు చేస్తారు. శాంపిల్ సైజ్ నుంచి సమాచారాన్ని సేకరిస్తారు. ఎన్నికల ప్రచారం సాగుతున్న కొద్దీ ప్రజల అభిప్రాయాలు మారే ఛాన్స్ ఉంది. అందుకే ఒపీనియన్ పోల్ ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎగ్జిట్ పోల్ అనేది ఓటు వేసిన తర్వాత బయటకు వచ్చిన ఓటరు అభిప్రాయాన్ని నేరుగా సేకరించే ప్రక్రియ. ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే పోలింగ్ కేంద్రం వెలుపల ఈ సర్వే చేస్తారు. సర్వే చేసే వ్యక్తులు పోలింగ్ బూత్ బయట వేచి ఉండి, ఓటు వేసి వస్తున్న వారిని మీరు ఎవరికి ఓటు వేశారు అని అడిగి తెలుసుకుంటారు. ఓటరు తన నిర్ణయాన్ని అమలు చేసిన తర్వాత చెప్పే మాటలు కాబట్టి ఇవి ఒపీనియన్ పోల్స్ కంటే కాస్త కచ్చితత్వానికి దగ్గరగా ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమే. అధికారిక ఫలితాలు కావు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగడానికి కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని రూల్స్ ఫ్రేమ్ చేసింది. ముఖ్యంగా ఎగ్జిట్ పోల్స్ ప్రసారంపై ఆంక్షలు విధించింది. ఎన్నికలు ఒకటి కంటే ఎక్కువ దశల్లో జరుగుతున్నప్పుడు అన్ని దశల పోలింగ్ పూర్తి అయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించకూడదు. ఇవాళ కూడా దీన్ని అమలు చేసింది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై ఆరు గంటలకు ముగిసింది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఆరున్న తర్వాత వెల్లడించారు. ఈ రూల్స్ అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ ఉంటాయి. మీడియా సంస్థలు, పరిశోధన ఏజెన్సీలు, పోలింగ్ సంస్థలు వివిధ పద్ధతుల ద్వారా డేటాను సేకరిస్తాయి. క్షేత్రస్థాయిలో ఓటర్లతో మాట్లాడటం ద్వారా, టెలిఫోన్ ద్వారా ఓటర్ల అభిప్రాయం తెలుసుకుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో టీంలను పంపించి సమాచారాన్ని సేకరిస్తారు. మరో వైపు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు అన్ని సర్వేలు డీఎంకే కూటమిదే మళ్లీ అధికారమని అంచనా వేశాయి. కానీ, ఒక్క సంస్థ మాత్రం దళపతి విజయ్ పార్టీ టీవీకే మెజార్టీ స్థానాల్లో గెలిచి, అధికారం చేపడుతుందని తెలిపింది. యాక్సిస్ మై ఇండియా సర్వే విజయ్ పార్టీ సునామీ తథ్యమని జోస్యం చెప్పింది. ఆ సంస్థ అంచనా ప్రకారం టీవీకే 98 నుంచి 120 స్థానాలు, డీఎంకే కూటమి 92 నుంచి 110, అన్నాడీఎంకే కూటమి 22 నుంచి 30 సీట్లలో గెలుస్తుందని పేర్కొంది. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడులో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలు. ఆ సర్వే అంచనా నిజమైతే విజయ్ ముఖ్యమంత్రి అవుతారు. అయితే, తుది ఫలితాలు అంచనాలకు దగ్గరగా ఉంటాయా? లేదా? అనేది మే 4న తేలిపోనుంది. అంతేకాదు, అంచనాలు తారుమారై డీఎంకే కూటమి మెజార్టీ మార్క్‌కు దగ్గరగా ఆగిపోతే విజయ్ మద్దతు కీలకమవుతుంది. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, గతంలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో యాక్సిస్ మై ఇండియా సర్వేలు నిజమయ్యాయి. గతంలో ఐదు సందర్భాల్లో మిగతా సంస్థలకు భిన్నంగా దీని అంచనాలు, ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి 359 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఈ అంచనాలకు అనుగుణంగా ఫలితాలు వచ్చాయి. 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, గతేడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలోనూ



కచ్చితంగా అంచనా వేసింది. మధ్యప్రదేశ్‌లో అన్ని సర్వేలూ కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే.. యాక్సిస్ మై ఇండియా మాత్రం 140- 162 సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. అన్నట్టుగానే బీజేపీ 163 సీట్లతో మళ్లీ అధికారం నిలబెట్టుకుంది. ఎగ్జిట్ పోల్స్ ఎప్పుడూ ఓట్ల లెక్కింపు రోజున వాస్తవ ఫలితాలుగా మారనప్పటికీ, అవి ప్రజా చర్చను ప్రభావితం చేస్తూ, తుది తీర్పుపై ఉత్కంఠను పెంచుతాయి. ఇక బెంగాల్ విషయానికి వస్తే పీపుల్స్ పల్స్ సర్వే టీఎంసీకి 177 నుంచి 187, బీజేపీకి 95-110 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. మ్యాట్రిజ్ సర్వే టీఎంసీ 125 నుంచి 140, బీజేపీ 146-161 చోట్ల విజయం సాధిస్తుందని పేర్కొంది. అయితే, పీ-మార్క్ సర్వే మాత్రం టీఎంసీ 118-138, బీజేపీ 150-175 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. చాణక్య స్ట్రాటజీస్ కూడా బీజేపీకి ఛాన్స్ ఉందని వెల్లడించింది. బీజేపీకి 150-160 స్థానాలు, తృణమూల్ కాంగ్రెస్‌కు 130-140 స్థానాలు వచ్చే ఛాన్స్ ఉందని తెలిపింది. పోల్ డెయిరీ కూడా కమలం వికసిస్తుందని అంచనా వేసింది. టీఎంసీకి 99 నుంచి 127, బీజేపీకి 142 నుంచి 171, కాంగ్రెస్ 3 నుంచి 5 స్థానాల్లో విజయం సాధిస్తాయని చెప్పింది. జన్మత్ 195 నుంచి 205 స్థానాలు టీఎంసీకి, 80 నుంచి 90 స్థానాలు బీజేపీకి వస్తాయని అంచనా వేసింది. అలాగే, ఎన్డీటీవీ అంచనాలు కూడా టీఎంసీ 146, బీజేపీ 140, ఇతరులు 6 చోట్ల విజయం సాధించే అవకాశం ఉన్నాయని తెలిపాయి. మరి ఈసారి కూడా ఈ సంస్థ అంచనాలు నిజమవుతాయా? అనేది మే 4న తెలుస్తుంది. తమిళనాడు ఎన్నికల్లో తొలిసారి పోటీచేసిన విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. ఈ సర్వే అంచనా వేసినట్టు ఫలితాలు ఉంటే.. విజయ్ చరిత్రను తిరగరాయనున్నారు. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్న సంస్థలు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఓటింగ్ సరళిని అంచనా వేయడానికి ఈ పద్ధతులను అనుసరించాయి. ఎగ్జిట్ పోల్స్ అనేవి కేవలం సంకేతాలు మాత్రమే ఇవి ఎప్పుడూ కచ్చితంగా ఉంటాయని చెప్పలేం. అనేక సందర్భాల్లో ఎగ్జిట్‌పోల్ అంచనాలు లెక్క తప్పుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో ఒకట్రెండు మినహా మిగతా సర్వే సంస్థల లెక్కలు తెప్పాయి.

కాళేశ్వరంపై రేవంత్ మార్క్ యుద్ధం

హైదరాబాద్, ఏప్రిల్ 30: తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన, అదే సమయంలో వివాదాస్పదమైన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం ఇప్పుడు ఒక కీలక మలుపు తిరిగింది. ప్రాజెక్టు వైఫల్యాలు, నిధుల దుర్వినియోగంపై కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త యుద్ధ తంత్రాన్ని సిద్ధం చేశారు. ఈ వ్యవహారాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ- సీబీఐ చేత దర్యాప్తు చేయించడం ద్వార అటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ను, ఇటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఇరకాటంలో పెట్టే వ్యూహానికి రేవంత్ పదును పెట్టారు. సాధారణంగా ఇలాంటి భారీ ప్రాజెక్టులపై విచారణలు న్యాయపరమైన చిక్కుల్లో చిక్కుకుపోతుంటాయి. దీనిని ముందుగానే పసిగట్టిన రేవంత్ సర్కార్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు తాజాగా మధ్యంతర ఆదేశాలు ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పంపిన సీబీఐ సిఫారసులో ఆ కమిషన్ ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడింది. దీనికి బదులుగా, గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన ప్రాథమిక నివేదికలను, ప్రాజెక్టులో జరిగిన నిధుల మళ్లింపు ఆరోపణలను ప్రధాన ప్రాతిపదికగా చూపారు. 9 నెలల కిందటే పంపిన ఈ సిఫారసు ద్వారా సీబీఐ రంగప్రవేశానికి ఉన్న సాంకేతిక

అడ్డంకులను ప్రభుత్వం తొలగించింది. వ్యవస్థాగతమైన దర్యాప్తు ద్వారా బాధ్యులను బోనులో నిలబెట్టడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా బీఆర్ఎస్ అగ్రనేతలపై చర్యలకు ఉపక్రమిస్తే, అది రాజకీయంగా కక్షసాధింపు అనే ముద్ర పడి సానుభూతిని తెచ్చిపెట్టే అవకాశం ఉందని రేవంత్ భావిస్తున్నారు. అందుకే ఈ బంతిని కేంద్రం కోర్టులోకి విసిరారు. వేల కోట్ల ప్రజాధనం వృథా అయిన ఈ కుంభకోణంపై కేంద్రమే విచారణ జరిపించాలని కోరడం ద్వారా బీజేపీ చిత్తశుద్ధిని రేవంత్ పరీక్షకు పెట్టారు. ఒకవేళ కేంద్రం సీబీఐ విచారణకు వెనుకాడుతే, "మోదీ-కేసీఆర్ ఒక్కటే" అనే ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, బీజేపీని డిఫెన్స్‌లో పడేయాలన్నది కాంగ్రెస్ వ్యూహం. సీబీఐ దర్యాప్తునకు పచ్చజెండా ఊపితే ఆ క్రెడిట్ రేవంత్ ఖాతాలోకి వెళ్తుంది. ఒకవేళ మౌనంగా ఉంటే బీఆర్ఎస్‌ను కాపాడుతున్నారన్న విమర్శలు వస్తాయి. కేవలం లేఖలతోనే సరిపెట్టకుండా, రేవంత్ రెడ్డి స్వయంగా సీబీఐ డైరెక్టర్‌ను కలవాలని లేదా మంత్రుల బృందాన్ని ఢిల్లీకి పంపాలని నిశ్చయించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ప్రాథమిక ఆధారాలను స్వయంగా అందజేయడం ద్వారా దర్యాప్తును అనివార్యం చేయాలన్నది వారి ప్లాన్. విచారణ జరిగినా, జరగకపోయినా.. ఈ అంశాన్ని కేంద్రంపైకి నెట్టడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందవచ్చని, ప్రజాధనం విషయంలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవచ్చని రేవంత్ సర్కార్ బలంగా నమ్ముతోంది. ఒకవేళ విచారణ ప్రారంభమై కేసీఆర్ కుటుంబం చుట్టూ ఉచ్చు బిగిస్తే, తెలంగాణ రాజకీయాల్లో మునుపెన్నడూ లేని విధంగా పెను మార్పులు సంభవించడం ఖాయం. రేవంత్ రెడ్డి పన్నిన ఈ చక్రవ్యూహం నుండి ప్రత్యర్థులు ఎలా బయటపడతారో వేచి చూడాలి.

Edited,Printed,Published and Owned by **PALLA KONDALA RAO**, H.No:5-13/1,Allapadu Road,Bonakal(Village,Post & Mandal),Khammam District-507204, Telangana State.
Printed at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah nagar, Gurralapadu (V), Tallampadu (Post), Khammam(Rural) Mandal, Khammam District, Pin-507170, Telangana State.
Published at H.No:11-3-17/1, Beside Ankura Hospital,Balaji Nagar, Khammam-507002, Telangana State, **EDITOR : PALLA KONDALA RAO** **RNI. No. TELTEL/2017/74161**